ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

మంగళవారం, మార్చి 10, 2026 | సంపుటి - 22 | సంచిక 163 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam




అసెంబ్లీ సాక్షిగా విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ అభాసుపాలయ్యింది

## ఉద్యోగ నోటిఫికేషన్ల హామీలకు దిక్కేది

- నిరుద్యోగులను మోసగించిన ప్రభుత్వం
- అసెంబ్లీలో అన్ని సమస్యలపైనా నిలదీస్తాం

మాజీమంత్రి,, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

**నిజామాబాద్, నినాదం:** ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ గాలిలో కలిసింది. అసెంబ్లీ సాక్షిగా విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ అభాసుపాలయ్యింది. రెండున్నరేండ్లు గడుస్తున్నా నోటిఫికేషన్లు ఎండమావిగా మారాయని మాజీమంత్రి,, బిఆరఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత రెడ్డి అన్నారు. వీటన్నటిపైనా వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఎంగడతామని అన్నారు. ఉద్యోగాల కల్పన, హామీలను

2



## వెలుగులోకి సింథటిక్ డ్రగ్స్

ఈగిల్ ఫోర్స్ దాడుల్లో వెలుగులోకి సంచలన విషయాలు

*హైదాబాద్, నినాదం: తెలంగాణలో భారీ సింథటిక్ డ్రగ్స్ రాకెట్‌ను పోలీసులు వెలుగులోకి తెచ్చారు. షాద్‌నగర్‌లో రహస్యంగా మెఫెడ్రోన్ డ్రగ్ తయారీ చేస్తున్న గ్యాంగ్ కార్యకలాపాలను ఈగిల్ ఫోర్స్ దర్యాప్తులో గుర్తించారు.*

2




## నకిలీ మందుల విక్రయంపై కఠిన చర్యలు

మెడికల్ షాపులకు డిసిఎ ఎస్ఎంఎస్ అలర్ట్

*హైదరాబాద్, నినాదం:నాణ్యతలేని మందుల విక్రయాన్ని అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీసీఏ ఆధ్వర్యంలో బల్క్ ఎసఎంఎస్ అలర్ట్ సిస్టమ్‌ను ప్రారంభించారు.*

2



## నకిలీ ఆహార పదార్థాల ముఠా పట్టివేత

కల్తీ నూనెలు, గోధుమపిండి స్వాధీనం



## ఇరాన్ సుప్రీం లీడర్‌గా అయతొల్లా మొజ్తాబా

- ఖమేనికి వ్లాదిమిర్ రష్యా అధ్యక్షుడు పుతిన్ అభినందనలు
- ఇరాన్‌కు మద్దతుగా ఉంటామని హామీ

2

**మాస్కో,మార్చి 9(నినాదం):** ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా అయతొల్లా మొజ్తాబా ఖమేనికి ఎన్నికయ్యారు. ఆయనకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అభినందనలు తెలిపారు. ఇరాన్‌కు మద్దతుగా ఉంటామని పుతిన్ హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం పుతిన్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎన్నికైన మొజ్తాబాకు శుభాకాంక్షలు. ఈ క్లిష్ట సమయంలో ఇరాన్‌కు రష్యా అండగా నిలబడుతుంది. ఇరాన్‌లోని మా స్నేహితులకు, వారి సమగ్రతకు రష్యా మద్దతుగా ఉంటుంది.

## నేరాల తీరుకు అనుగుణంగా

# పనితీరు మార్చుకోవాలి

## ప్రజాసేవలో ఎప్పుడూ పోలీసులే ముందు



- సాయం కోసం ప్రజలు వారి వైపే చూస్తారు
- ప్రజలకు మీరున్నారనే ధైర్యం ఇందుకు కారణం
- నేరాల తీరు మారి.. సైబర్ క్రైమ్ పెరిగింది
- పోలీస్ ఆఫీసర్స్ రీట్రీట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

*ఛాలెంజ్ లు రెండు రకాలు.. ఒకటి టెక్నికల్ ఛాలెంజ్, రెండోది అడాప్టివ్ఛాలెంజ్ అన్నారు. రిసోర్సెస్, సమయాన్ని కేటాయిస్తే టెక్నికల్ ఛాలెంజ్ ను అధిగమించవచ్చన్నారు. కానీ అడాప్టివ్ఛాలెంజ్ విషయంలో ఎదురైన సమస్య లోతును అర్థంచేసుకోవాల్సి ఉంటుందన్నారు.*

2

**హైదరాబాద్,మార్చి9(నినాదం):** ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి పోలీస్ అధికారులు చేస్తున్న కృషిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. మనం ఎక్కడున్నామో తెలిసుకోగలిగితే మనం ఎక్కడికి చేరుకోవాలో తెలుస్తుందన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్`2026 కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ రిట్రీట్ కార్యక్రమం ద్వారా సమస్యలు, పరిష్కారాలపై విశ్లేషించుకున్నట్లు సిఎం తెలిపారు. ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే శాంతిభద్రతలు అదుపులో ఉండాలన్నారు. రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ ఉండకూడదనే తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ డాక్యుమెంట్ ను ఆవిష్కరించుకున్నామని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడానికి ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న 2100కి.మీ ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ గా పరిగణించుకుంటున్నాం అని అన్నారు.



## అత్యున్నతంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ

### ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు

- ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ
- క్రీడాశాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

2

**హైదరాబాద్,మార్చి9(నినాదం):** అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. వర్సిటీ నిర్మాణాలకు సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించారు. దీనికి సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని సదుపాయాలతో స్పోర్ట్స్ వర్సిటీ నిర్మాణాలు ఉండాలి. ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటేలా చర్యలు తీసుకోవాలి. కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియాన్ని ఆధునికీకరించాలి. అదేవిధంగా గచ్చిబౌలి ఔట్‌డోర్ స్టేడియాన్ని పునరుద్ధరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్రీడాశాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు.

## కవితకు మళ్లీ నోటీసులు!

2



- లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం..
- కవిత సహా 23 మందికి నోటీసులు

## అమెరికా, ఇజ్రాయెల్‌తో మోదీ రాజీపడ్డారు

- కుట్ర బయటపడుతుందనే వెనుకడుగు
- దేశ ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది
- సంక్షోభంతో చమురు ధరల పెరుగే అవకాశం
- కేంద్రంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- పశ్చిమాసియా సంక్షోభంపై చర్చకు డిమాండ్

**న్యూఢిల్లీ,మార్చి 9(నినాదం):** భారత ప్రధాని నరేం ద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. పశ్చిమాసియా సంక్షోభం గురిం చి పార్లమెంట్‌లో చర్చించడానికి కేంద్ర ప్రభు త్వం ఇష్టపడటం లేదని ఆరోపించారు. పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంట్‌లో చర్చ జరిగితే ప్రధాని మోదీ అమెరికా, ఇజ్రాయె ల్‌కు ఎలా రాజీపడ్డారో బయటపడుతుందని అన్నారు.

▸▸తరువాయి2లో..

## డిఫాల్టర్లకు బేస్.. పూడూరు పీడీఎస్ రైస్







- సిఎంఆర్ ల చెల్లింపునకు పీడీఎస్ బియ్యం
- అంతా తెలుసు...అందుకే అలుసు
- సీఎం రికవరీ ఆదేశాలు బేఖాతరు
- అవకాశముండీ వదిలేస్తున్న అధికారులు.!

**జగిత్యాల ప్రతినిధి, మార్చి 9(నినాదం):** ప్రభుత్వం అత్యంత సీరియస్ గా తీసుకున్న నిర్ణయం జగిత్యాల జిల్లాలో నీరుగారుతోంది.మిల్లర్లు పీడీఎస్ బియ్యాన్నేసీఎంఆర్ ల కింద సర్కారుకు తిరిగి పెడుతున్నారు. వీరికి స్థానికంగా ఉన్న ఓ స్మగ్లర్ సహకరిస్తున్నాడు.అన్నీ తెలిసి అధికారులు అంటగాగుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో వినిపిస్తున్న వాదనలివి.

### సర్కారు బియ్యం సర్కారుకే..!

జిల్లాలోని మల్యాల మండలం పూడూరుకు చెందిన ఓ స్మగ్లర్ ధర్జాగా పీడీఎస్ దందా సాగిస్తున్నాడు.జిల్లాలో గల పలు డీఫాల్టు మిల్లర్లకు ఆ బియ్యాన్ని తరలించుకుంటూ కోట్లు గడిస్తున్నాడు.కాగా ధాన్యాన్ని అమ్ముకున్న మిల్లర్లకు ఆ బియ్యమే వరంగా మారాయి .సర్కారు ఒత్తిడి నేపథ్యంలో సదరు మిల్లర్లు ప్రస్తుతం ఇదే బియ్యాన్ని సిఎంఆర్ లు గా ముట్టజెపుతున్నారు. అంటే ధాన్యాన్ని అమ్ముకుని కోట్లు గడించి పావలా అర్ధకు కొన్న సర్కారు బియ్యాన్ని సర్కారుకే అప్పజెపుతున్నారన్నమాట. అధికారులకు ఇదంతా తెలిసినా ఎవరి వాటా వారికి ముడుతుందనే అక్రమార్కుడు అలుసుగా తీసుకుంటున్నాడని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## శ్రీవారికి అపచారం చేస్తే ఊరుకునేది లేదు

- లడ్డూ కల్తీపై ఇంకా సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు
- గతంలో జరిగిన పొరపాట్లు లేకుండా పట్టాదార్ పాస్ పుస్తకాలు
- నంద్యాల జిల్లా పర్యటనలో సిఎం చంద్రబాబు

2

**నంద్యాల,మార్చి9(నినాదం):** శ్రీవారికి అపచారం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని, మతవిద్వేషాలను రెచ్చగొట్టాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోమారు హెచ్చరించారు. లడ్డూ కల్తీపై ఇంకా సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సోమవారం డోన్ నియోజకవర్గంలోని కొత్తబురుజు గ్రామంలో ముఖ్యమంత్రి పర్యటించారు. రైతులకు నూతన పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పాస్‌పుస్తకాలు, సర్వే రాళ్లపై జగన్ ఫొటోలు ఉండటం ఏంటి అని ప్రశ్నించారు. ఇదేంటని అడిగితే బాధితులపైనే కేసులు పెట్టారని విమర్శించారు.




## ఎనిమిదేళ్ల యుద్ధానికైనా సిద్ధం

- చమురు సంపద కోసమే ఈ యుద్ధం
- చమురు కబ్జాకు అమెరికా పన్నాగం
- ఇరాన్‌ను ముక్కలు చేసేందుకు కుట్ర
- దేశాన్ని కాపాడుకునేందుకే మా పోరాటం
- అమెరికా, ఇజ్రాయెల్‌కు లొంగే ప్రసక్తే లేదు
- ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వెల్లడి
- హర్మూజ్ జలసంధి మూసివేతపై సంకేతాలు!

2



**లెబనాన్, మార్చి9(నినాదం):** అమెరికాపై ఇరాన్ సంచలన ఆరోపణలు చేసింది. తమ దేశాన్ని ముక్కలు చేయాలని అమెరికా కుట్ర పన్నిందని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘయీ ఆరోపించారు. ఇరాన్‌కు చెందిన అపార చమురు సంపదపై నియంత్రణ కోసమే అమెరికా ఈ యుద్ధం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇరాన్‌ను బలహీనపర్చి, దేశ సార్వభౌమత్వానికి భంగం కలిగించడమే లక్ష్యంగా అమెరికా, ఇజ్రాయెల్

# ఉద్యోగ నోటిఫికేషన్ల హామీలకు దిక్కేది

అయితే సమాధానం చెప్పేందుకు ప్రభుత్వం సిద్దంగా లేదని అర్థం అవుతోందన్నారు. నిరుద్యోగులు రెండున్నరేండ్లుగా కండ్లుకాయలు కాసేలా ఎదురుచూసినా ఫలితం లేకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం తమను నమ్మించి మోసం చేసిందంటూ నిరుద్యోగులు నిరసనలు వ్యక్తం చేస్తున్నా, ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. హామీ మేరకు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలని వేముల డిమాండ్ చేశారు. ఇదిలావుంటే పోలీస్‌శాఖలో తక్షణమే 20 వేల పోస్టులతో ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వాలని 'పోలీస్ ఉద్యోగాల నిరుద్యోగ జేఏసీ' డిమాండ్ చేస్తున్నది. భారీగా నిరసలకు పిలుపునిచ్చింది. భారీ ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను ఇప్పటికే ఆవిష్కరించింది. వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని, వయోపరిమితిని 35 ఏండ్లకు పెంచాలని, జీవో 46ను రద్దు చేయాలని, లాంగ్‌జంప్‌ను 3.8 మీటర్లకు తగ్గించాలనే ప్రధాన డిమాండ్లతో నిరసన చేపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ పోలీస్ ఉద్యోగార్థులకు అలవిగాని హామీలు ఇచ్చిందని, తీరా అధికారంలోకి వచ్చాక తమను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. ఇదిలావుంటే ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్‌ల కోసం కర్ణాటక తరహాలో ఉద్యమిస్తామని నిరుద్యోగులు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. జనరల్ ఉద్యోగాలకు తక్షణం నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 'తెలంగాణ నిరుద్యోగ జేఏసీ' ఆధ్వర్యంలో 13న నిరుద్యోగ మార్చ్ నిర్వహించనున్నారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం విఫలమైనందున నిరుద్యోగ మార్చ్‌కు భారీగా నిరుద్యోగులు తరలిరావాలని పిలుపునిచ్చారు. 13న అసెంబ్లీ ముట్టడితో పాటు, టీజీపీఎస్సీని కూడా ముట్టిస్తామని నిరుద్యోగ జేఏసీ నాయకులు ప్రకటించారు. ఏడాదికి ఇస్తామన్న రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో, బడ్జెట్ సమావేశాలలోపు అన్నిశాఖల్లో ఉన్న ఖాళీలతో మరో జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేసారు. 2024 ఆగస్టులో అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ చిత్తు కాగితంలా మారిపోయిందని మండిపడ్డారు. ఆ జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు వస్తాయని ఆశించారని, నోటిఫికేషన్లు ఇవ్వకపోవడంతో కోచింగ్ సెంటర్లలోనే సమయం, డబ్బు వ థా అవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడంతో డబ్బులు పంపేందుకు కూడా తల్లిదండ్రులు సంకోచిస్తున్నారని, స్వగ్రామాలకు వెళ్తే తలెత్తుకొని తిరిగే పరిస్థితి లేదని నిరుద్యోగులు వాపోతున్నారు.

# వెలుగులోకి సింథటిక్ డ్రగ్స్

ఈ కేసులో సంచలన విషయాలు బయటపడటంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. దర్యాప్తులో భాగంగా ఎస్పార్ ఇన్నోవేషన్స్ అనే సంస్థ ద్వారా డ్రగ్స్ తయారీలో ఉపయోగించే నిషేధిత రసాయనాలను సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. ముఖ్యంగా మెఫెడ్రోన్ తయారీలో ఉపయోగించే 2 బ్రోమో`4 మెథైల్ ప్రోపియోఫీనోన్ అనే రసాయనంతో పాటు, క్లోఫెడ్రోన్ తయారీలో ఉపయోగించే 3 క్లోరో`1 ఫెనైల్`1 ప్రోపనోన్ అనే కెమికల్స్‌ను సరఫరా చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ఎస్పార్ ఇన్నోవేషన్స్ డైరెక్టర్ షేక్ రఫీ కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. ఇండియా మార్ట్ ద్వారా రాజస్థాన్‌కు చెందిన నిందితులకు ఈ రసాయనాలను సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. రాజస్థాన్‌కు చెందిన గ్యాంగ్ మూడు విడతల్లో దాదాపు 300 కిలోల రసాయనాలను కొనుగోలు చేసినట్లు సమాచారం. నిందితులు తప్పుడు కంపెనీ పేర్లతో కెమికల్స్ కొనుగోలు చేసి షాద్‌నగర్‌లో అద్దె గదిని తీసుకుని అక్కడే డ్రగ్స్ తయారీ చేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. తయారు చేసిన డ్రగ్స్‌ను తిరిగి రాజస్థాన్‌కు తరలించి విక్రయిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ గ్యాంగ్‌కు రాజస్థాన్‌కు చెందిన గిరీష్ థాపర్ అలియాస్ వీరేంద్ర స్వామి నాయకత్వం వహిస్తున్నాడు. నకిలీ పేర్లతో వ్యవహరిస్తూ డ్రగ్స్ తయారీకి అవసరమైన ముడి సరుకును సేకరించినట్లు పోలీసులు గుర్తించారు. గ్యాంగ్‌లో మనీష్ బిష్ణోయి, మనోజ్ మాథూర్, శిశుపాల్, సుమీత్, రాజు కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. ఈ కెమికల్స్ సరఫరాకు సంబంధించి లక్షల రూపాయల లావాదేవీలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈగిల్ పోలీసుల సమాచారంతో రాజస్థాన్ పోలీసులు వీరేంద్ర స్వామి, మనీష్ బిష్ణోయిని అదుపులోకి తీసుకున్నారు. వారి విచారణలో షాద్‌నగర్‌లో నడుస్తున్న డ్రగ్ ల్యాబ్ విషయం బయటపడింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నార్కోటిక్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల కేసు నమోదు చేశారు. పోలీసులు మరికొంతమంది నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

# నకిలీ మందుల విక్రయంపై కఠిన చర్యలు

ఈ వ్యవస్థ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెడికల్ షాపులకు వెంటనే సమాచారం అందించేలా చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా నాణ్యతలేని, అనుమానాస్పద మందులు గుర్తించిన వెంటనే అన్ని మెడికల్ షాపులకు ఎస్ఎంఎస్ ద్వారా అలర్ట్ పంపిస్తున్నారు. దీంతో ఆ మందుల విక్రయాన్ని వెంటనే నిలిపివేయాలని మెడికల్ షాపులకు సూచనలు అందుతాయి. ప్రజలకు హానికరంగా మారే మందులు మార్కెట్‌లో అమ్మకుండా ముందుగానే అడ్డుకోవడమే ఈ వ్యవస్థ ప్రధాన లక్ష్యం. నాణ్యతలేని మందులు అమ్మడం వల్ల రోగుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ఈ చర్యలను చేపట్టింది. ఈ కొత్త వ్యవస్థకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెడికల్ షాపులను ప్రభుత్వం అనుసంధానం చేస్తోంది. ఒకసారి అలర్ట్ జారీ అయిన వెంటనే ప్రతి ఫార్మసీకి సమాచారం చేరేలా డిజిటల్ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. ఔషధాల నాణ్యత, పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు డిజిటల్ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆధునిక వ్యవస్థలను ప్రవేశపెట్టి మందుల నియంత్రణను మరింత కట్టుదిట్టం చేసేలా డీసీఏ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

# నకిలీ ఆహార పదార్థాల ముఠా పట్టివేత

**హైదరాబాద్, నినాదం:**

హైదరాబాద్ గచ్చిబౌలిలో పోలీసులు కల్తీ మాఫియా గుట్టురట్టు చేశారు. 5 వేల లీటర్ల కల్తీ వంటనూనె, 5 టన్నుల కల్తీ గోధుమ పిండి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.21 లక్షల విలువ చేసే నకిలీ పదార్థాలను సీజ్ చేశారు. గచ్చిబౌలిలోని ఓ గోదాములో కల్తీ ఆహార పదార్థాలు ఉన్నట్లు సమాచారం అందుకున్న ఎసఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. నిత్యావసరాలు కల్తీ చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో కల్తీ నూనెలు, గోధుమ పిండి తయారీ ముఠాను గుర్తించి దాడి చేశారు. కల్తీ ఆహార పదార్థాలు తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్న ముఠాను మాదాపూర్ ఎస్వోటీ పోలీసులు పట్టుకున్నారు. మాదాపూర్ ఎస్వోటీ పోలీసులు నిర్వహించిన దాడుల్లో తండ్రీ, కొడుకులను అరెస్టు చేశారు. వట్టినగులపల్లి ఇందిరమ్మ కాలనీలోని శ్రీ జస్నాత్ ట్రేడర్స్ దుకాణంపై ఎస్వోటీ పోలీసులు సోమవారం దాడి చేశారు. గడువు ముగిసిన వివిధ కంపెనీల వంట నూనెలను సేకరించి, సోయాబీన్ నూనెతో కలిపి కల్తీ వంట నూనెను తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అలా తయారైన నూనెను వివిధ ప్రసిద్ధ బ్రాండ్ల పేర్లతో ప్యాక్ చేసి మార్కెట్‌లో అమ్ముతున్నట్లు దాడుల్లో బయటపడింది. అదే విధంగా గడువు తీరిన గోధుమ పిండిని వివిధ ప్రాంతాల నుంచి సేకరించి... 'జస్నాత్ గోల్డ్ చక్కి అట్టా' పేరుతో తిరిగి ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. రైడ్‌లో సుమారు 10 లక్షల రూపాయల విలువైన 5,026 లీటర్ల కల్తీ వంట నూనె, 3 లక్షల రూపాయల విలువైన 5,192 కిలోల గోధుమ పిండిని స్వాధీనం చేసుకున్నారు. పెయిటింగ్ మెషిన్, ఆయిల్ ఫిల్టర్ మెషిన్, గోధుమ ఫిల్టర్ మెషిన్‌తో పాటు ఇతర సామాగ్రిని కూడా సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న మొత్తం వస్తువుల విలువ సుమారు 21 లక్షల రూపాయలుగా అంచనా వేశారు. ఈ కేసులో రాజస్థాన్‌కు చెందిన భన్వర్ రామ్ జాట్ (46), అతని కుమారుడు అశోక్ కుమార్‌లను అరెస్టు చేశారు. నిందితులను గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఇరాన్ సుప్రీం లీడర్‌గా అయతొల్లా మొజ్తాబా

మొజ్తాబా తన తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఇరాన్ ప్రజల్ని ఏకతాటిపైకి తెస్తారని భావిస్తున్నాం. యుద్ధం కొనసాగుతున్న ఈ సమయంలో నాయకత్వం వహించడానికి మొజ్తాబాకు గొప్ప ధైర్యం, పట్టుదల కావాలని పుతిన్ తన సందేశంలో పేర్కొన్నారు. ఒకవైపు మొజ్తాబా ఎన్నికపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేస్తుంటే, రష్యా మాత్రం మద్దతుగా నిలవడం విశేషం. ఈ యుద్ధ సమయంలో ఇరాన్‌కు రష్యా నైతిక మద్దతు ప్రకటించింది. ఇటీవలే ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్తో పుతిన్ ఫోన్లో మాట్లాడారు. దాడుల్లో మరణించిన ఖమేనీ, అతడి కుటుంబ సభ్యులు, ఇరాన్ ప్రజలు, సైనికులకు పుతిన్ సంతాపం తెలిపారు. దీనికి మసౌద్ ఆయనకు క?తజ్ఞతలు తెలిపారు. తాజాగా ఇరాన్ సుప్రీం లీడర్‌గా మొజ్తాబాను అక్కడి అసెంబ్లీ ఎన్నుకున్న సంగతి తెలిసిందే. 1969లో జన్మించిన మొజ్తాబా ఇరాన్‌లోనే మత గురువుల వద్ద విద్యనభ్యసించారు.తాజాగా ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో మొజ్తాబా తండ్రి, ఇరాన్ సుప్రీం లీడర్ అయిన అయతొల్లా ఖమేని, తల్లి, అతడి భార్య కూడా మరణించారు.

# నేరాల తీరుకు అనుగుణంగా పనితీరు మార్చుకోవాలి

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమిగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని అన్నారు. దేశంలో ఢిల్లీ అత్యంత కాలుష్య నగరంగా మారింది. ట్రాఫిక్ సమస్యలతో బెంగుళూరు నగరంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముంబై, చెన్నై నగరాలు వరదలతో సతమతమవుతున్నాయి. అలాంటి మెట్రోపాలిటన్ నగరాల నుంచి మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏ సమస్య వచ్చినా ప్రజలు మొట్టమొదట సహాయం కోసం ఎదురు చూసేది పోలీసుల కోసమేనని అన్నారు. ఒకప్పుడు తీవ్రవాదం ఒక సమస్యగా ఉండేది.. ఇందుకోసం ఆక్టోపస్, గ్రేహౌండ్స్ లాంటి వ్యవస్థలు తీసుకొచ్చారు. పోలీస్ శాఖలో సిబ్బంది రేషనలైజేషన్ చేసుకుని జనాభా ప్రాతిపదికన పోలిసింగ్ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి. పోలీస్ శాఖలోని వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలి. పోలీస్ శాఖలో ఉద్యోగులు ఆటో మోడ్ కు వెళితే సమాజానికి అత్యంత ప్రమాదకరం. ఇతర శాఖల్లా పోలీస్ శాఖలో ఆటో మోడ్.. ఆటో ప్రమోషన్ ఉండదు. పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు అప్ గ్రేడ్ అవ్వాల్సిందేనని అన్నారు.అవసరమైన నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంది. పనితీరు ఆధారంగానే పోస్టింగులు ఉంటాయి. ప్రతీ ఏటా డిసెంబరులో రిట్రీట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. బడ్జెట్ ప్రవేశపెట్టకముందే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకుంటే అవసరమైన నిధులను బడ్జెట్ లో కేటాయించుకోవచ్చుని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్యక్రమానికి వచ్చిన సిఎంకు పోలీస్ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.

# అత్యున్నతంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ



యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పనపై అధికారులతో చర్చించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పన, అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్చించారు. ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా రాష్ట్రంలో అన్ని సౌకర్యాలతోపాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణాలు ఉండాలని సీఎం అన్నారు. గచ్చిబౌలి ఔట్ డోర్ స్టేడియంను పునరుద్ధరించడం తో పాటు, స్టేడియం ఆవరణలో ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ కాంప్లెక్స్, హాస్టల్ భవనాలు, అన్ని రకాల క్రీడా మైదానాలు, శిక్షణకు అవసరమైన ఇతర సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా నిర్మాణాలకు సంబంధించి పలు డిజైన్లను పరిశీలించారు. డిజైన్లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేసారు. ఒలంపిక్స్, కామన్ వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా, ఒలంపిక్స్ లో తెలంగాణ క్రీడాకారుల సత్తా చాటడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నగరంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్బీ స్టేడియం, సరూర్ నగర్ స్టేడియంలను భవిష్యత్ అవసరాలు, శిక్షణ, పోటీలకు అనుగుణంగా ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేంనరేందర్ రెడ్డి, శాప్ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక?ష్ణా రావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీనివాస రాజు, శేషాద్రి, ఎండీ సోనీ బాలదేవి, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి. కిషోర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కవితకు మళ్లీ నోటీసులు!

న్యూఢిల్లీ : ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కల్వకుంట్ల కవిత సహా 23 మంది నిందితులకు ఢిల్లీ హైకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. రౌస్ అవెన్యూ కోర్టు నిందితులకు ఊరట కలిగిస్తూ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన కోర్టు, ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ.. తదుపరి విచారణను మార్చి 16వ తేదీకి వాయిదా వేసింది. సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మోహతా వాదనలు వినిపించారు. ఇటీవల ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఈ కేసులో నిందితులుగా ఉన్న ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, కల్వకుంట్ల కవితతో పాటు మొత్తం 23 మందిపై సీబీఐ అభియోగాలను డిశ్చార్జ్ చేస్తూ వారికి ఊరట కలిగించడం తెలిసిందే. అయితే ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో నిందితులకు అనుకూలంగా రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కేసు విచారణలో భాగంగా నిందితులపై ఉన్న అభియోగాలను మరింత లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని, కింది కోర్టు నిర్ణయంపై స్టే ఇవ్వాలని సీబీఐ కోరింది. దీనిపై స్పందించిన ఢిల్లీ హైకోర్టు, నిందితులు విచారణకు హాజరు కావాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. ఇటీవల రౌస్ అవెన్యూ కోర్టు లిక్కర్ స్కాం కేసులో కీలక వ్యాఖ్యలు చేసింది. దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లలోని కొన్ని అంశాలపై స్పష్టత లేదని, సాక్ష్యాధారాల సేకరణలో జాప్యం జరుగుతోందని కోర్టు అభిప్రాయపడింది. కొందరు నిందితులు తమపై ఉన్న కేసులను కొట్టివేయాలని (డిశ్చార్జ్) కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లపై రౌస్ అవెన్యూ కోర్టు సానుకూలంగా స్పందించింది. కేవలం ఆరోపణలతో కేసు దర్యాప్తు జరిగిందని, తగినన్ని ప్రాథమిక ఆధారాలు లేకుండా నిందితులను ఎక్కువ కాలం జైల్లో ఉంచడం లేదా విచారణను సాగదీయడం సరికాదని కోర్టు పేర్కొంది.


SHRIRAM Finance

## శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్: 6వ అంతస్తు (లెవల్-2), బిల్డింగ్ నెం.క్యూ2, అరమ్ Q parc, Gen 4/1, TTC, థానే బేలాపూర్ రోడ్, ఘన్సోలి, నవీ ముంబయి-400710.

### డిమాండ్ నోటీసు

ఈ క్రింద తెలిపిన రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/హామీదారులు **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** (పూర్వపు శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెని లిమిటెడ్ వారిలో విలీనమైనారు, అనంతరం **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చినారు**) నుండి ఆర్థిక సహాయమును వినియోగించుకున్నారు. సదరు రుణగ్రహీతలు/హామీదారులు పొందిన రుణ సహాయముపై అసలు మరియు వడ్డీ మొత్తములను గడువు తేదీలోగా తిరిగి చెల్లించటంలో విఫలమైనారు. కావున సదరు ఖాతాను రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాచే జారీ చేయబడిన సూచనలు/మార్గదర్శకాల ప్రకారం నిర్దర్ధక ఆస్తిగా వర్గీకరించినారు, అనంతరం **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్క అధికృత అధికారి సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదవబడు సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసులను జారీ చేస్తూ SARFAESI యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) కింద రుణగ్రహీతలు/హామీదారులు/తనఖాదారులను నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా ఒప్పందం రేటు (ప్రకారం చెల్లింపు తేది వరకు నోటీసులో తెలిపిన బకాయి మొత్తము మరియు అనుషంగిక ఖర్చులు, ధరలు, చార్జీలు మొదలగు వాటితో నోటీసులో తెలిపిన మొత్తముపై తదుపరి వడ్డీతో కింద తెలిపినట్లు చెల్లించవలసిందిగా కోరడమైనది. సదరు నోటీసులు వారి ఆఖరిగా తెలిసిన చిరునామాలకు పంపగా అవి బట్వాడా కాకుండా మాకు తిరిగి వచ్చినందున వాటిని బహిరంగ నోటీసు రూపంలో ప్రచురించడమైనది. మీ సెక్యూర్ అస్తులను విడిపించుకొనుటకు గల సమయ లభ్యతకు సంబంధించి సదరు చట్టంలోని సెక్షన్ 13యొక్క సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలను కోరడమైనది.

| రుణగ్రహీత(లు)/ సహ-రుణగ్రహీత(లు)/ హామీదారుల పేరు | | |
|---|---|---|
| **1) వెంకట నరసింహ వేముల** తండ్రి వేముల యాదయ్య, వయస్సు:42 స., వృత్తి: స్వయం ఉపాధి, నివాసం: ఇం.నెం:1-30, సంకిషాల(గ్రా.), వాలిగొండ, నల్గొండ-508112. వ్యాపారం: "నెట్ పాయింట్" ప్రొప్రైటర్, వాలిగొండ మెయిన్ రోడ్, వాలిగొండ-508112, సెల్:9704790143. **2) వేముల వెంకటమ్మ** భర్త వేముల యాదయ్య, వయస్సు:66 స., వృత్తి: స్వయం ఉపాధి, నివాసం: ఇం.నెం:1-30, సంకిషాల(గ్రా.), వాలిగొండ(మం.), నల్గొండ-508112, సెల్:7032338899. **3) షేక్ సలీం పాషా** తండ్రి వలి షేక్, వయస్సు:31 స., వృత్తి: ప్రైవేట్ ఉద్యోగి, నివాసం: ఇం.నెం:3-133/1, ఎడుల్లాగూడెం, వాలిగొండ, నల్గొండ-508112. వ్యాపారం: "అపోలో ఫార్మసీ", ఉప్పల్ బ్రాంచ్, సెల్:7981829402. | ఎన్‌పిఎ తేది : 08.12.2022<br>రావల్సిన బకాయి మొత్తం : రూ.20,83,793/- | డిమాండ్ నోటీసు తేది: 02.02.2026<br>రుణ మొత్తం : రూ.10,00,000/- |

**SANNGTF2107240003: స్థిరాస్తి వివరణ :** ఇల్లు నెం.1-38, సర్వే నెం.280, ఇటుక గోడలతో నిర్మించబడిన, నిర్మించిన వైశాల్యం 330 చ.అ., RCC రూఫ్, విస్తీర్ణం **326 చ.గ. లేదా 272.536 చ.మీ.**, సంకిషాల గ్రామం, వాలిగొండ మండలం, యాదాద్రిభువనగిరి జిల్లా. **సరిహద్దులు : తూర్పు :** వేముల స్వామి ఇల్లు; **పడమర :** వేముల మైసమ్మ ఇల్లు; **ఉత్తరం :** వేముల కిష్టయ్య ఇల్లు; **దక్షిణం :** C.C.రోడ్డు.

...రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలు/ హామీదారులు/ చట్టబద్ధ వారసులు

పైన తెలిపిన పరిస్థితుల్లో ఈ నోటీసు (ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్య వడ్డీ మరియు వర్తించు చార్జీలతో పాటు పైన తెలిపిన బకాయి మొత్తాన్ని చెల్లించవలసిందిగా పై రుణగ్రహీతలను, సహ-రుణగ్రహీతలను మరియు/లేదా వారి హామీదారులు (వర్తితే వర్తించినా అది)ను ఈ నోటీసు ద్వారా కోరడమైనది, విఫలమైనచో ఈ నోటీసు తేది నుండి 60 రోజుల గడువు తీరిన తర్వాత సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు అందులోని వర్తించు రూల్స్‌లోని సెక్షన్ 13(4) కింద రుణగ్రహీతలను మరియు తనఖాదారులు యొక్క సెక్యూర్ అస్తుల స్వాధీనతో కలుపుకొని సెక్యూర్ అస్తులపై తదుపరి చర్యలు తీసుకొనబడును.

సదరు చట్టంలోని సెక్షన్ 13(13) కింద సెక్యూర్డ్ క్రెడిటార్ వారి ముందస్తు వాతపూర్వక సమ్మతి లేకుండా ఈ నోటీసులో తెలుపబడిన అతని సెక్యూర్ అస్తులను అమ్మకం, లీజు లేదా ఇతరత్రా ద్వారా బదిలీ చేయరాదని రుణగ్రహీతను నిషేధించడమైనది.

తేది : 09.03.2026
ప్రదేశం : నల్గొండ & హైదరాబాద్

అధికృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్



SHRIRAM Finance

## శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్: 6వ అంతస్తు (లెవల్-2), బిల్డింగ్ నెం.క్యూ2, అరమ్ Q parc, Gen 4/1, TTC, థానే బేలాపూర్ రోడ్, ఘన్సోలి, నవీ ముంబయి-400710.

### డిమాండ్ నోటీసు

ఈ క్రింద తెలిపిన రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/హామీదారులు **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** (పూర్వపు శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెని లిమిటెడ్ వారిలో విలీనమైనారు, అనంతరం **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చినారు**) నుండి ఆర్థిక సహాయమును వినియోగించుకున్నారు. సదరు రుణగ్రహీతలు/హామీదారులు పొందిన రుణ సహాయముపై అసలు మరియు వడ్డీ మొత్తములను గడువు తేదీలోగా తిరిగి చెల్లించటంలో విఫలమైనారు. కావున సదరు ఖాతాను రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాచే జారీ చేయబడిన సూచనలు/మార్గదర్శకాల ప్రకారం నిర్దర్ధక ఆస్తిగా వర్గీకరించినారు, అనంతరం **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్క అధికృత అధికారి సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదవబడు సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసులను జారీ చేస్తూ SARFAESI యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) కింద రుణగ్రహీతలు/హామీదారులు/తనఖాదారులను నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా ఒప్పందం రేటు (ప్రకారం చెల్లింపు తేది వరకు నోటీసులో తెలిపిన బకాయి మొత్తము మరియు అనుషంగిక ఖర్చులు, ధరలు, చార్జీలు మొదలగు వాటితో నోటీసులో తెలిపిన మొత్తముపై తదుపరి వడ్డీతో కింద తెలిపినట్లు చెల్లించవలసిందిగా కోరడమైనది. సదరు నోటీసులు వారి ఆఖరిగా తెలిసిన చిరునామాలకు పంపగా అవి బట్వాడా కాకుండా మాకు తిరిగి వచ్చినందున వాటిని బహిరంగ నోటీసు రూపంలో ప్రచురించడమైనది. మీ సెక్యూర్ అస్తులను విడిపించుకొనుటకు గల సమయ లభ్యతకు సంబంధించి సదరు చట్టంలోని సెక్షన్ 13యొక్క సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలను కోరడమైనది.

| రుణగ్రహీత(లు)/ సహ-రుణగ్రహీత(లు)/ హామీదారుల పేరు | | |
|---|---|---|
| **1) అనిల్ కుమార్ రావణబోయిన** తండ్రి సత్యనారాయణ రావణబోయిన, వయస్సు:40 స., వృత్తి: స్వయం ఉపాధి, నివాసం: ఇం.నెం:1-5-1084/202, గ్రౌండ్ ఫ్లోర్, మంగాపురం కాలనీ, ఓల్డ్ అల్వాల్, రంగారెడ్డి-500010. వ్యాపారం: "ది ట్రినిటీ టెక్నాలజీస్", 5వ అంతస్తు, రష్ హాస్పిటల్ సమీపం, VRK సిల్క్స్ బిల్డింగ్, సుచిత్ర, మేడ్చల్-మల్కాజ్‌గిరి-500067, సెల్:9133111226. **2) కల్పన రావణబోయిన** భర్త అనిల్ కుమార్ రావణబోయిన, వయస్సు:29 స., వృత్తి: గృహిణి, నివాసం: ఇం.నెం:1-5-1084/202, గ్రౌండ్ ఫ్లోర్, మంగాపురం కాలనీ, ఓల్డ్ అల్వాల్, సికింద్రాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి-500010, సెల్:9160047027. **3) చిలుక భవాని @ చిలుక దుర్గ భవాని** భర్త చిలుక సత్తయ్య, తండ్రి రావణబోయిన సత్యనారాయణ కుమార్తె, వయస్సు:45 స., వృత్తి: గృహిణి, నివాసం: ఇం.నెం:14-85, రామాయంపేట, మెదక్, తెలంగాణ-502101, సెల్:7893214542 / 9885943334. **4) రాజు పైడకుల** తండ్రి రాజన్న పైడకుల, వయస్సు:42 స., వృత్తి: స్వయం ఉపాధి. చిరు-I: ఇం.నెం:3-37/2, బ్రాహ్మణపల్లి-503111. చిరు-II: ఇం.నెం:1-4-171/1/84/1, ఓల్డ్ అల్వాల్, తిరుమల ఎన్‌క్లేవ్, మోర్ సూపర్ మార్కెట్ సమీపం, వెంకటేశ్వర కాలనీ, సికింద్రాబాద్-500010, సెల్:7416412333. | ఎన్‌పిఎ తేది : 09.04.2025<br>రావల్సిన బకాయి మొత్తం : రూ.23,84,197/- | డిమాండ్ నోటీసు తేది: 04.02.2026<br>రుణ మొత్తం : రూ.20,00,000/- |

**BSRBGTF2306260001: స్థిరాస్తి వివరణ :** ప్లాట్లు నెం.8 & 9, బ్లాక్ నెం.16, సంతోష్ టాకీస్ ఏరియా, సర్వే నెం.63/AA, "జయ కిషన్ ఎన్‌క్లేవ్", ఫేజ్-VI, రామాయంపేట (గ్రామం & మండలం), మెదక్ జిల్లా. ప్లాట్ నెం.8: **87.5 చ.గ. / 73.1 చ.మీ.**; ప్లాట్ నెం.9: **200 చ.గ. / 167.22 చ.మీ.**; మొత్తం: **287.5 చ.గ. / 240.38 చ.మీ. సరిహద్దులు : తూర్పు :** 30 అడుగుల వెడల్పు రోడ్డు; **పడమర :** విక్రేత యొక్క ప్లాట్లు నెం.6 & 7; **ఉత్తరం :** సిలం కృష్ణారెడ్డి & మోరీ భూమి; **దక్షిణం :** J. అంజనేయులు యొక్క ప్లాట్ నెం.10.

...రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలు/ హామీదారులు/ చట్టబద్ధ వారసులు

పైన తెలిపిన పరిస్థితుల్లో ఈ నోటీసు (ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్య వడ్డీ మరియు వర్తించు చార్జీలతో పాటు పైన తెలిపిన బకాయి మొత్తాన్ని చెల్లించవలసిందిగా పై రుణగ్రహీతలను, సహ-రుణగ్రహీతలను మరియు/లేదా వారి హామీదారులు (వర్తితే వర్తించినా అది)ను ఈ నోటీసు ద్వారా కోరడమైనది, విఫలమైనచో ఈ నోటీసు తేది నుండి 60 రోజుల గడువు తీరిన తర్వాత సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు అందులోని వర్తించు రూల్స్‌లోని సెక్షన్ 13(4) కింద రుణగ్రహీతలను మరియు తనఖాదారులు యొక్క సెక్యూర్ అస్తుల స్వాధీనతో కలుపుకొని సెక్యూర్ అస్తులపై తదుపరి చర్యలు తీసుకొనబడును.

సదరు చట్టంలోని సెక్షన్ 13(13) కింద సెక్యూర్డ్ క్రెడిటార్ వారి ముందస్తు వాతపూర్వక సమ్మతి లేకుండా ఈ నోటీసులో తెలుపబడిన అతని సెక్యూర్ అస్తులను అమ్మకం, లీజు లేదా ఇతరత్రా ద్వారా బదిలీ చేయరాదని రుణగ్రహీతను నిషేధించడమైనది.

తేది : 09.03.2026
ప్రదేశం : మేడ్చల్-మల్కాజ్‌గిరి & మెదక్

అధికృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్


# ఎనిమిదేళ్ల యుద్ధానికైనా సిద్ధం

పనిచేస్తున్నాయని మండిపడ్డారు. ఆ రెండు దేశాలు కలిసి దాడులు చేయడానికి ముందు కూడా, చాలా విడతల దౌత్య చర్చల్లో ఇరాన్ పాల్గొందని ఇస్మాయిల్ బఘయి గుర్తుచేశారు. ఇప్పుడు అమెరికా, ఇజ్రాయెల్‌లు తమ సైనిక చర్యను సమర్థించుకునేలా ప్రకటనలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇస్మాయిల్ బఘయి ఈ కామెంట్స్ చేశారు."ఇరాన్ సార్వభౌమత్వానికి భంగం కలిగించాలని అమెరికా, ఇజ్రాయెల్ భావిస్తున్నాయి. మా దేశ ప్రజలను ఓడించాలని ఆ రెండు దేశాలు అనుకుంటున్నాయి. మానవత్వానికి విఘాతం కలిగించేలా అవి ప్రవర్తిస్తున్నాయి. ఇప్పుడు ఇవన్నీ అందరికీ తెలుసు. మేం మరింత వివరించాల్సిన అవసరమే లేదు. వెనెజువెలాలాగే ఇరాన్‌లోని అపారమైన చమురు సంపదపైనా అక్రమంగా నియంత్రణ పొందాలని అమెరికా భావిస్తోంది. వెనెజువెలా (17.17 శాతం), ఇరాన్(11.82 శాతం)లలోని 31 శాతం చమురు వనరులపై పట్టు సాధించాలని ఆ దేశం అనుకుంటోంది. ఇదే అమెరికా అతిపెద్ద వ్యూహం. దీనిపై ఎలాంటి సందేహమూ అక్కర్లేదు" అని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘయి పేర్కొన్నారు. "మా దేశ భూభాగాన్ని, సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు మేం పోరాడుతూనే ఉంటాం. శత్రుదేశాలు చేస్తున్న క్రూరమైన దాడులను ఎదుర్కొని తీరుతాం. ఇజ్రాయెల్‌కు సాయం చేసేందుకే ఈ యుద్ధంలోకి దిగామని అమెరికా బహిరంగంగానే ఒప్పుకుంది. ఈవిషయాలన్నీ ప్రజలకు స్పష్టంగా అర్థమయ్యాయి. ఇరాన్ ప్రజలూ ఇవన్నీ గ్రహించారు" అని ఇస్మాయిల్ బఘయి తెలిపారు. హెజ్బుల్లా, హమాస్, హౌతీల వంటి సంస్థలను ఆయన సమర్థించారు. ఇజ్రాయెల్ అణచివేతకు వ్యతిరేకంగానే వారు పోరాడుతున్నారనీ, మానవత్వం లేని పరిస్థితుల్లో బతుకుతున్న వారు తిరగబడటంలో తప్పులేదని అన్నారు. అలాగే పొరుగు దేశాలైన యూఏఈ, కువైట్, బహ్రెయిన్ వంటి వాటిపై దాడుల గురించి స్పందిస్తూ.. మా భూభాగంపై దాడి చేయడానికి అమెరికాకు మీ నేలని ఇవ్వకండి. ఒకవేళ అమెరికా దాడులకు మీరు సహకరిస్తే, మమ్మల్ని మేము కాపాడుకునే హక్కు మాకు ఉంటుంది అని కీలక హెచ్చరిక చేశారు. భారత్‌కు కూడా ఈ యుద్ధ సెగ తగులుతుందని, చమురు ధరల పెరుగుదల వల్ల నష్టపోయే భారత్ కూడా ట్రంప్‌పై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హోర్ముజ్ జలసంధిని మూసివేయడంపై కూడా ఆయన స్పందించారు. ఇప్పటి వరకు ఇరాన్ దానిని మూసివేయలేదని, కానీ ఒకవేళ ఆ పరిస్థితి వస్తే మాత్రం అది అందరికీ మూసుకుపోతుందని హెచ్చరించారు. మరోవైపు యుద్ధంలో రష్యా, చైనా మద్దతుపై వస్తున్న వార్తలను ఆయన కేవలం మీడియా ఊహాగానాలుగా కొట్టిపారేశారు. శాంతి స్థాపన జరగాలంటే ప్రపంచ దేశాలు ట్రంప్, నెతన్యాహు దగ్గరకు వెళ్లి యుద్ధం ఆపమని చెప్పాలని, బాధితులైన ఇరాన్‌ను నియంత్రించమనడం సబబు కాదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.

## ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం ప్రభావం

న్యూఢిల్లీ : ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం ప్రభావం బెంగళూరులోని రెస్టారెంట్లపై తీవ్రంగా పడింది. పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతల కారణంగా ఎల్పీజీ సిలిండర్ల సరఫరా హఠాత్తుగా నిలిచిపోయిందని, దీంతో రేపటి నుంచి నగర వ్యాప్తంగా హోటళ్లను మూసివేస్తామని బెంగళూరు హోటల్స్ అసోసియేషన్ పేర్కొంది. తీవ్ర కమర్షియల్ గ్యాస్ కొరత కారణంగా రేపటి నుంచి రెస్టారెంట్లు, హోటళ్లను నిర్వహించలేమని ఆ ప్రకటనలో తెలిపింది. గ్యాస్ సరఫరా దాదాపు పూర్తిగా ఆగిపోయిందని, అందుకే తాము ఈ నిర్ణయం తీసుకుంటున్నామని వెల్లడించింది. యుద్ధం నేపథ్యంలో 70 రోజుల వరకు గ్యాస్ సరఫరాకు గ్యాస్ కంపెనీలు హామీ ఇచ్చాయని, కానీ అందుకు విరుద్ధంగా గ్యాస్ సరఫరా చేయడం లేదని ఆ ప్రకటనలో తెలిపింది. అందుకే ఈ నెల 10వ తేదీ నుంచి రెస్టారెంట్లు, హోటళ్లను మూసివేస్తున్నట్లు పేర్కొంది.

# శ్రీవారికి అపచారం చేస్తే ఊరుకునేది లేదు

వైసీపీ హయాంలో జరిగిన తప్పులను సరిచేస్తున్నామని చెప్పారు. రికార్డులు తారుమారు చేయకుండా పకడ్బంధీగా పాస్‌పుస్తకాలు ఇస్తున్నామని, క్యూఆర్ కోడ్‌తో పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఎవరు తప్పు చేసినా వెంటనే తెలుస్తుందన్నారు. ఒక్కపైసా కూడా అవినీతి లేకుండా పట్టా ఇప్పించే బాధ్యత తమదని స్పష్టం చేశారు. సమస్యలన్నీ పరిష్కరించాకే కొత్త పాక్ బుక్స్ ఇస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఎక్కడా తప్పులు జరగకుండా చూస్తామని సీఎం అన్నారు. గత ఐదేళ్లు దుర్మార్గ పాలన సాగిందని సీఎం విమర్శించారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీవారి ప్రసాదాన్ని కూడా కల్తీ చేశారని సీఎం ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం తిరుమల పవిత్రతను దెబ్బతీసే ప్రయత్నం చేసిందని విమర్శించారు. సీబీఐ రిపోర్ట్ ఇచ్చినా లడ్డూ కల్తీపై తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తిరుమలపై ద?ష్టి పెట్టానని సీఎం తెలిపారు. కల్తీ మద్యంతో చాలా మంది చనిపోయేలా చేశారని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. హంద్రీనీవాతో తాగునీరు, కుప్పానికి కూడా నీళ్లు ఇచ్చామని చెప్పారు. రాయలసీమలో ప్రతి ఎకరానికి నీళ్లు ఇవ్వాలనేది తన సంకల్పమని పేర్కొన్నారు. మాజీ మంత్రి వివేకాను దారుణంగా చంపారని.. నాన్న లేరు చిన్నాన్న కూడా లేరంటూ డ్రామాలు ఆడారని సీఎం విమర్శించారు. నారాసుర రక్తచరిత్ర అంటూ తన చేతిలో కత్తి పెట్టారని ఆరోపించారు. జగన్ మాటలు నమ్మి 2019లో తనకు ఓటు వేయలేదని చెప్పారు. తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఎదురుదాడి చేస్తున్నారని ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేశారు. డబ్బు మీద ఆశతో ఒక్కరి కంటే ఎక్కువ మందిని కనడం లేదని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పుడు ఇద్దరి కంటే ఎక్కువ మందిని కనాల్సిన అవసరం వచ్చిందని తెలిపారు. పెద్ద కుటుంబానికి ఎక్కువ సహాయం చేసేలా పథకాలు తీసుకొస్తామన్నారు. రైతే రాజు కావాలని.. రైతు అప్పులపాలు కావడానికి వీల్లేదన్నారు.

# అమెరికా, ఇజ్రాయెల్‌తో మోదీ రాజీపడ్డారు



పశ్చిమాసియాలో పరిస్థితులు దేశ ప్రజలపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని తెలిపారు. అలాగే అక్కడి సంక్షోభం చమురు ధరల పెరుగుదలకు దారితీయవచ్చని అభిప్రాయపడ్డారు. "పశ్చిమాసియా సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద నష్టాన్ని కలిగిస్తుంది. స్టాక్ మార్కెట్లలో ఏం జరుగుతుందో మీరు చూశారు. ప్రధాని మోదీ అమెరికా ట్రేడ్ డీల్‌పై సంతకం చేశారు. దీంతో దేశం దెబ్బ తినబోతోంది. అలాగే పశ్చిమాసియా సంక్షోభం గురించి చర్చించడంలో వారికి ఏ సమస్య ఉంది? ఆ తర్వాత మనం ఇతర అంశాలపై చర్చ జరపవచ్చు. పశ్చిమాసియా మన దేశానికి ముఖ్యం కాదా? ఇంధన ధరలు, ఆర్థిక విధ్వంసం మనకు ముఖ్యమైన చర్చనీయాంశాలు కావా? అవే మనకు ప్రజా సమస్యలు" అని రాహుల్ గాంధీ అన్నారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని తాము ముఖ్యమైనదిగా భావిస్తున్నామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అందుకే ఆ అంశంపై చర్చను కోరుతున్నామని అన్నారు. "కానీ కేంద్ర సర్కార్ పశ్చిమాసియా సంక్షోభం గురించి చర్చ జరిపేందుకు ఇష్టపడడం లేదు. ఎందుకంటే ఆ అంశంపై చర్చ జరిపితే ఇతర విషయాలు బయటకు వస్తాయి. ప్రధాని మోదీ వైఖరి బయటపడుతుంది. మోదీ ఎలా రాజీ పడ్డారు? ఆయనను ఎలా బ్లాక్ మెయిల్ చేస్తున్నారు? వంటి విషయాలు తెలుస్తాయి. అందుకే పార్లమెంట్‌లో పశ్చిమాసియా సంక్షోభంపై చర్చకు కేంద్రం ఇష్టపడడం లేదు. చర్చకు డిమాండ్ చేస్తున్న సమయంలో ప్రధాని మోదీ పార్లమెంట్ నుంచి ఎలా పారిపోయారో మీరు చూశారు. ఒకవేళ పశ్చిమాసియా సంక్షోభంపై చర్చ జరిగితే ప్రధాని మోదీ పార్లమెంట్‌కు రాలేరు" అని రాహుల్ వ్యాఖ్యానించారు. అలాగే వీబీ జీ రామ్ జీ అమలు నేపథ్యంలో కేంద్ర సర్కార్‌పై కాంగ్రెస్ మండిపడింది. ఈ పథకం వివరాలు ఇంకా రూపొందుతున్నాయని, ఇది మోదీ ప్రభుత్వ వేగవంతమైన విధానానికి సరైన ఉదాహరణ అని పేర్కొంది. 'మొదట ప్రకటించండి, తరువాత ఆలోచించండి' అనే విధానాన్ని కేంద్రం అనుసరిస్తోందని మండిపడింది. ఈ మేరకు కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. "2025 డిసెంబరులో కేవలం రెండు రోజుల్లోనే మోదీ ప్రభుత్వం లోక్‌సభ, రాజ్యసభలో ఎంజీనరేగా రద్దును బుల్డోజ్ చేసింది. రాష్ట్రాలతో ఎటువంటి సంప్రదింపులు జరపలేదు. సంబంధిత స్టాండింగ్ కమిటీ ద్వారా ఎటువంటి పరిశీలన జరగలేదు. 2026 ఏప్రిల్ 1నుంచి కొత్త చట్టం అమలు కానుంది. దీని అమలుకు ముందుగా జరగాల్సిన సంప్రదింపులు ఇప్పుడు జరుగుతున్నాయి. వివరాలు ఇంకా రూపొందుతున్నాయి" అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. కాగా, పశ్చిమాసియా ఘర్షణల వేళ రాజ్యసభలో సోమవారం కీలక ప్రకటన చేశారు కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్. పశ్చిమాసియాలోని పరిణామాలు అందరికీ ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. వాటిపై ఎప్పటికప్పుడు ప్రధాని మోదీ సమీక్ష జరుపుతున్నారని తెలిపారు. అలాంటి పరిస్థితులకు చర్చలు, దౌత్యపరమైన చర్యలే పరిష్కారమని అభిప్రాయపడ్డారు. పశ్చిమాసియా ప్రాంతాల్లో నివసిస్తున్న భారతీయుల సంక్షేమం, భద్రతపై తమ ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. భారత వినియోగదారులపై భారం పడకుండా, చమురు లభ్యత, ధరలను నియంత్రించేందుకు దౌత్య పరంగా కృషి చేస్తున్నట్టు చెప్పారు. అలాగే పశ్చిమాసియాలో చిక్కుకున్న భారతీయులను వెనక్కి రప్పించేందుకు భారత్ అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని అన్నారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న సుమారు కోటి మంది భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టినట్టు వివరించారు. కాగా, పశ్చిమాసియా సంక్షోభం పార్లమెంట్ ఉభయ సభలను సోమవారం కుదిపేసింది. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై చర్చకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు రాజ్యసభ, లోక్‌సభలో నిరసనలు చేపట్టాయి. దీంతో పార్లమెంట్ ఉభయ సభలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తున్నాయని బీజేపీ ఎంపీలు ఆరోపించారు.



## మహిళల ఆరోగ్యంపై అవగాహన

**నిజామాబాద్ ప్రతినిధి, మార్చి 9 (నినాదం):** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో రైల్వే హాస్పిటల్లో మహిళల ఆరోగ్యంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైల్వే హాస్పిటల్ డాక్టర్ పి. విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డా.గ్రీష్మిక మహిళల ఆరోగ్య సంరక్షణపై పలు ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు తమ ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా పరీక్షించుకోవడం, గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం ప్రాముఖ్యత అలాగే సాధారణంగా ఎదురయ్యే గైనకాలజీ సమస్యలు మరియు వాటి నివారణ గురించి సమగ్రంగా వివరించారు. మహిళలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా సమయానికి వైద్యులను సంప్రదించడం అవసరమని సూచించారు.ఈ కార్యక్రమంలో రైల్వే హాస్పిటల్ సిబ్బంది, మహిళా ఉద్యోగులు, రోగులు పాల్గొన్నారు. కార్యక్రమం మహిళల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంలో ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

### మైనారిటీ రెసిడెన్షియల్ మోడల్ స్కూళ్లను
# తనిఖీ చేసిన కలెక్టర్

**కేర్ టేకర్ అనుచిత ప్రవర్తనపై విద్యార్థినులు, సిబ్బంది ఫిర్యాదు**

**విధుల నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్**





**నిజామాబాద్ ప్రతినిధి, మార్చి 9 (నినాదం):** బాల్కొండ మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల విద్యాలయాన్ని, మోడల్ స్కూల్ లను కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. స్టోర్ రూమ్, కిచెన్ తదితర వాటిని పరిశీలించారు. స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నారా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ కేర్ టేకర్ ఎం.వీణ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ, తమతో అనుచితంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థినులు, సిబ్బంది కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ విద్యార్థినులతో ప్రత్యేకంగా భేటీ అయి, పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేర్ టేకర్ రెగ్యులర్ గా విధులకు హాజరు కారని, తమ బాగోగుల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదని, మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని, హాస్టల్ లో నీటి కొరత తీవ్ర స్థాయిలో నెలకొని ఉన్నప్పటికీ ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదని, కేర్ టేకర్ అసంబద్ధ వైఖరి వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని బాలికలు ముక్త కంఠంతో కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. సదరు కేర్ టేకర్ తమను కూడా పరుష పద జాలాలతో దూషిస్తూ, అనుచితంగా ప్రవర్తిస్తున్నారని మోడల్ స్కూల్ సిబ్బంది సైతం కలెక్టర్ ఎదుట కన్నీటి పర్యంతం అయ్యారు. దీనిని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్, మోడల్ స్కూల్ కేర్ టేకర్ వీణ తీరుపై తక్షణ విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జీ.ఈ.సీ.ఓ భాగ్యలక్ష్మి , ఇంచార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ లు విచారణ జరిపి నివేదిక సమర్పించారు. వారి నివేదిక ఆధారంగా కేర్ టేకర్ వీణను విధుల నుండి తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, విద్యార్థుల ప్రయోజనాల విషయంలో ఎంతమాత్రం రాజీ పడబోమని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు. మోడల్ స్కూల్ లో నీటి కొరతను శాశ్వతంగా పరిష్కరించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు కలెక్టర్ మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేసి సిబ్బంది హాజరును పరిశీలించారు. పదవ తరగతి గదిని సందర్శించి, విద్యార్థినులకు గణితంలో పలు ప్రశ్నలు వేసి, వారి అభ్యాసనా సామర్థ్యాలను అంచనా వేశారు. సరైన సమాధానాలు చెప్పిన బాలికలను అభినందిస్తూ, చాక్లెట్ బాక్సులు అందజేశారు. పరీక్షలు సమీపించినందున ఏకాగ్రతతో చక్కగా చదువుకోవాలని, కేవలం పాస్ మార్కులు కాకుండా అత్యుత్తమ గ్రేడ్ పాయింట్లతో ఉత్తీర్ణత సాధించాలని స్ఫూర్తి కలిగించారు. గతేడాది 100 శాతం ఉత్తీర్ణత నమోదు అయ్యిందని ప్రిన్సిపాల్ తెలుపగా, ఈసారి కూడా శత శాతం ఫలితాలు వచ్చేలా విద్యార్థినులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. తాను మరోమారు ఆకస్మిక తనిఖీకి వస్తానని, పాఠశాల నిర్వహణను మరింతగా మెరుగుపరచాలని అన్నారు.





## మధ్యాహ్న భోజన నాణ్యతపై కలెక్టర్ ఆగ్రహం

**ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీస్ జారీ చేసిన నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్ కర్నూల్ మార్చి 9 (నినాదం)** జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతపై జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో కలిసి సహపంక్తి మధ్యాహ్న భోజనం చేశారు విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, మెనూ అమలు విధానంపై కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు రాష్ట్ర ప్రభుత్వ మధ్యాహ్న భోజన మార్గదర్శకాల ప్రకారం మెనూలో భాగంగా విద్యార్థులకు కిచిడి, గుడ్డు, మిక్స్డ్ వెజిటేబుల్ కర్రీ ఇవ్వాల్సి ఉంది. అయితే పాఠశాలలో విద్యార్థులకు వైట్ రైస్, గుడ్డు, సాంబార్ మాత్రమే వడ్డిస్తున్నట్లు కలెక్టర్ గమనించారు. నిర్ణయించిన కామన్ డైట్ మెనూను ఎందుకు పాటించలేదని పాఠశాల సిబ్బందిని కలెక్టర్ ప్రశ్నించారు విద్యార్థులకు వడ్డించిన అన్నం, సాంబార్ నాణ్యత సరిగా లేకపోవడంతో కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అన్నం సరిగా వండకపోవడం, సాంబార్ పసుపు నీళ్ల లాగా నాణ్యత కూడా బాగోలేదని గుర్తించిన కలెక్టర్ పాఠశాల హెడ్మాస్టర్ భాస్కర్ రెడ్డి మరియు వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజూ పిల్లలకు ఇలాగే భోజనం పెడుతున్నారా? అన్నం ఎలా ఉంటుందో కూడా తెలియదా? అంటూ ఉపాధ్యాయులను కలెక్టర్ మందలించారు. జిల్లాలో అనేక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేసి పరిశీలించినప్పటికీ, ఇంత నాసిరకం భోజనం ఎక్కడా లేదన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కానీ ఇలాంటి నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటుందని, ఎందుకు మిమ్మల్ని విధుల నుండి సస్పెండ్ చేయరాదని కలెక్టర్ ప్రధానోపాధ్యాయుడిని, ఉపాధ్యాయురాలిని ప్రశ్నించారు. విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందేలా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. రోజువారీ కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా పాటించాలని, మధ్యాహ్న భోజన వంట ప్రక్రియను ప్రతిరోజూ పర్యవేక్షించాలని హెడ్మాస్టర్‌కు ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు పాఠశాల హెడ్మాస్టర్ భాస్కర్ రెడ్డి మరియు ఫుడ్ చెకింగ్ టీచర్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ కు ఫోన్ ద్వారా కలెక్టర్ ఆదేశించారు. ఇద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ కోరాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని కచ్చితంగా అమలు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన మరియు పౌష్టికాహారం అందేలా అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం మరియు విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సక్రమంగా అమలయ్యేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. అంతకుముందు 10వ తరగతి విద్యార్థులతో పరీక్షలకు కేవలం నాలుగు రోజుల సమయం మాత్రమే ఉందని ఈ నెల రోజులు సమయాన్ని వృధా చేయకుండా ప్రతి పరీక్షకు భయం లేకుండా హాజరై మంచి ఉత్తీర్ణత శాతాన్ని సాధించాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో 100% ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని పాఠశాలకు గైర్హాజరైన విద్యార్థులపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ విద్యా సంవత్సరం 128 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వివరించారు. పదో తరగతి విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన ప్రీ ఫైనల్ పరీక్షల మార్కులను ఇప్పటివరకు ఎందుకు అందించలేదని కలెక్టర్ ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ వెంట నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్ బాదాం రమేష్, నాగర్ కర్నూల్ ఆర్డీఓ సురేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, వార్డు కౌన్సిలర్ నిజాముద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## ప్రజాస్వామ్య వ్యవస్థలో పాత్రికేయుల పాత్ర కీలకం

**త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు: టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్**

**నిజామాబాద్ ప్రతినిధి, మార్చి 9 (నినాదం)** జర్నలిస్టుల చిరకాల వాంఛ అయిన ఇళ్ల స్థలాల విషయమై జిల్లా కలెక్టర్ అధికారులతో ప్రత్యేక సమావేశమై త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. జర్నలిస్టులకు ఎల్లప్పుడూ అండగా ఉం టానని జర్నలిస్టుల సమ స్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బస్వా గార్డెన్ లో ప్రెస్ క్లబ్ నూత న కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహా దారులు మొహమ్మద్ షబ్బీర్ అలీ, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ,తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహే ర్ బిన్ హుందా న్,నగర మేయర్ కూరగాయల ఉమారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, వేలే నెస్ ఆస్పత్రి ఎండీ అసద్ ఖాన్, వెల్నెస్ ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ వెంకట్ రెడ్డి రాజకీ య నాయకులు ప్రముఖులు ము ఖ్య అతి థులుగా హాజ రయ్యారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ కమిటీ నూతన కార్యవర్గం ముఖ్య అతిథులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ జర్నలిస్టులో లేనిది రాజకీయ నాయకులు లేరనే సూక్తి నేను నమ్ము తానని టిపిసిసి అధ్యక్షు లు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నా రాజకీయ మార్గంలో ఎందరో జర్నలిస్టులు నాకు ఎంతో సహకారం అందిం చారని ఈ సందర్భంగా తెలిపారు. భారత రాజ్యాంగ ప్రకారం జర్నలిస్టులు ఫోర్త్ పిల్లర్ అని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాత్రికేయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న విషయాలను ప్రజలకు నిజాయితీగా తెలియజేసే బాధ్యత మీడియాపై ఉందని, ప్రజల సమస్యలను పాలకులకు చేరవేయడంలో జర్నలిస్టులు కీలక వంతు పోషిస్తున్నారని అన్నారు. నిజామాబాద్ ప్రెస్ క్లబ్ కొత్త కమిటీ జర్నలిస్టుల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.టిపిసిసి నాయకుడిగా కాదు జర్న లిస్టులకు సోదరిడిగా నేను ఉంటానని అన్నారు. జర్నలిస్టుల కష్టాల్లో పాలు పంచుకుంటానని అన్నారు. ప్రతిరోజు వివిధ పేప ర్లు చదివితేనే ఎంతో తృప్తిగా ఉంటుందన్నారు.





రాష్ట్రంలోనే జర్నలి స్టుల ను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నా రూ. జర్నలిస్టుల వృత్తి ఎంతో గొప్పది అన్నారు. రాజకీయాలు కొంతవరకు కలుషితమైతుందినే మాట వాస్తవమే. రాజకీయాల్లో మంచి చేసే వారిని ప్రోత్సహించండనీ తెలి పారు. జర్నలిస్టుల సమ స్యల పరిష్కారానికి నేను ఎల్లప్పుడూ అండగా ఉంటానని బొమ్మ మహేష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ జర్నలిస్ట్ లు ఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాల సమస్య హౌసింగ్ సొసైటీ ద్వారా నామినల్ ప్రైస్ లో ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు.అతి త్వరలోనే వారి సమస్యను పరిష్కరిస్తామన్నారు. టీపీసీసీ చీఫ్, స్థానిక ఎమ్మెల్యేలు సూర్యనారాయణ, భూపతిరెడ్డి మేమందరం కలిసి దశ దిశా నిర్దేశం చేసి సమస్య పరిష్కరిస్తామన్నారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి మాట్లాడుతూ జరలిస్టులు ఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాల సమస్య కొత్తదేమి కాదని రూరల్ నియోజకవర్గంలో స్థలం చూసి ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల అప్పజెప్పే బాధ్యత తీసుకుంటామన్నారు.కాంగ్రెస్ పార్టీ జర్నలిస్టులకు అండగా ఉంటుందన్నారు.అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ మీడియా ప్రజల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే వారధి అని వారి సమస్యలు పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.జర్నలిస్ట్ ల న్యాయమైన సమస్య ఇళ్ల స్థలాల గత టిఆర్ఎస్ హయాంలో మాట తప్పారని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వారికి వెంటనే ఇల్లాస్థలాలు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా నిజామాబాద్ నగర మేయర్ కూరగాయల ఉమారాణి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

**ఎన్నికైన ప్రెస్ క్లబ్ నూతన కమిటీ కార్యవర్గ సభ్యులు**

అధ్యక్షులు పంచరెడ్డి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి డా॥ వాగ్మారే సుభాష్, కోశాధికారి రాజ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్ర టరీ బి.రాజు, ఉపాధ్యక్షులు బైసా సంగీత, సతీష్ గౌడ్, గోవిందరాజు, సంయుక్త కార్యదర్శి రవీందర్ నాయ క్, ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు సితారే కృష్ణ, పబ్బ భూమేష్, ఆడెపు నరేంద్ర స్వామి, జి.భాస్కర్ గౌడ్, సందీప్ దేశ్ ముఖ్, కొట్టూరు సుదర్శన్, రవి చరణ్ రెడ్డి, తాళ్ళ శ్రీధర్, ప్రీతం రెడ్డి, ఆడెపు శ్రీనివాస్, సి.ఎస్. జయపాల్, కొక్కు రవిలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి రాంభూ పాల్ ,కాంగ్రెస్ పార్టీ జిల్లా ,నగర అధ్య క్షులు నగేష్ రెడ్డి, బొబ్బిలి రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, కాటిపల్లి నరేందర్ రెడ్డి, ఖుద్దూస్, వివిధ పార్టీల నాయకులు, జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**జర్నలిస్టులకు వెల్నెస్ ఆసుపత్రి ఉచిత ఐడి కార్డ్ ల ఆవిష్కరణ**

వెల్ నెస్ ఆస్పత్రిలో జర్నలిస్టులకు ఉచితంగా వైద్యం అందించేలా రూపొందించిన వెల్లే ఆసుపత్రి ఐడి కార్డు లకు సంబంధించి కార్యక్రమాన్ని ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. జర్నలిస్టులకు అండగా మేముంటామని వెల్నెస్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ అసద్ ఖాన్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వెంకటరెడ్డి తెలిపారు. నిజామాబాద్ ప్రెస్ క్లబ్ జనరేషన్ పూర్తి గా ఉచిత వైద్యం అంది స్తామని ఈ సందర్భంగా తెలిపారు. జర్నలిస్టుకే కాకుండా వారి కుటుం బానికి కూడా పూర్తిగా ఉచిత వైద్యం వెల్నెస్ ఆసుపత్రి నుండి అందిస్తామన్నారు.

## ఇంటర్ పరీక్షలకు 676 మంది విద్యార్థుల గైర్హాజరు

**నిజామాబాద్ ప్రతినిధి, మార్చి 9 (నినాదం)** ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం భౌతికశాస్త్రం, అర్థ శాస్త్రం, ఒకేషనల్ పరీక్షలు ప్రశాంతంగా జరగగా 96.7శాతం విద్యార్థులు హాజరయ్యారని జిల్లా ఇంటర్ విద్యా అధికారి రవికుమార్ తెలిపారు. మొత్తం 20,413 మంది విద్యార్థులకు గాను19,737 మంది హాజరయ్యారని, 676 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారన్నారు. జనరల్ లో మొత్తం 17,578మంది విద్యార్థులకు గాను 17,073 మంది విద్యార్థులు హాజరు కాగా, ఒకేషనల్ లో 2,835 మంది విద్యార్థులకు గాను 2,664 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. జిల్లాలో మొత్తం 58 పరీక్షా కేంద్రాలకు గాను 55 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించామని డిఐఈవో తెలిపారు. 8 పరీక్ష కేంద్రాలు డిఐఈవో తనిఖీ చేయగా, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు13, హై పవర్ కమిటీ 6, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లు మొత్తం 28 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి పర్యవేక్షించారన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం, మార్చి 9(నినాదం )** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక–99 రోజుల కార్యక్రమం నేపథ్యంలో సోమవారం ఖమ్మంలోని శ్రీనివాస నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శనలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. రామారావు , ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. వేణుమాధవరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని సమీక్షించి, అక్కడ నిర్వహిస్తున్న నమోదులను పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా అనే విషయాన్ని తెలుసుకుని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని ఆదేశించారు.(ప్రధానంగా పీహెచ్ సీ లోపల మరియు చుట్టుపక్కల పరిశుభ్రత నిర్వహణ) ఈ కార్యక్రమంలో వైద్య అధికారి డా. సమీరా, నర్సింగ్ అధికారి కల్పనా, ఔషధాధికారి కే. రాజిత మరియు కార్యాలయ సహాయకుడు రవి తదితరులు పాల్గొన్నారు.



## గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్

**నలుగురు విద్యార్థులకు అస్వస్థత.. ప్రభుత్వ వైద్యశాలకు తరలింపు..**

**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పాఠశాల సిబ్బంది: మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు**







**మణుగూరు మార్చి 9 (నినాదం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో సోమవారం మహాత్మా జ్యోతిరావ్ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కావడంతో, నలుగురు విద్యార్థులకు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే పాఠశాల సిబ్బంది విద్యార్థులను దగ్గర్లో ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు తరలించి విద్యార్థులకు వైద్య సేవలు అందిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న మాజీ ప్రజా ప్రతినిధి మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు హుటా హుటిన గురుకుల పాఠశాలను సందర్శించారు. అక్కడ పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు జరిగిన సంఘటనను దాటవేస్తూ ఎదురుదాడికి దిగుతున్నట్లు ఆయన ఆరోపించారు. అసలు విద్యార్థులకు పాఠశాలలో వడ్డించే ఫుడ్ కంటే, బయటి నుంచే వచ్చేబిర్యానిలు చికెన్ ఫ్రైడ్ రైస్లు ఫాస్ట్ ఫుడ్లు తెప్పించుకొని భుజించడం వలననే అస్వస్థత గురైనట్లు రేగా కాంతారావు ఆరోపించారు. బయట నుంచి తినుబండారాలను తరలించే వ్యక్తిని నిలదీసి ప్రశ్నించిన నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో, రేగకాంత్ రావు ఆ వ్యక్తిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల సిబ్బంది ప్రధానోపాధ్యాయులు పొంతన లేని సమాధానాలతో పరిస్థితిని తారుమారు చేస్తున్నట్లు ఆయన ఆరోపించారు. ఇదే విషయాన్ని విద్యార్థులు వారి తల్లిదండ్రులకు వెంటనే సమాచారం అందించాలని కాంతారావు కోరినప్పటికిని పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నట్టు ఆయన ఆరోపించారు. బయట వ్యక్తులతో బయటినుంచి తిను పదార్థాలను తెప్పించుకోవడం విద్యార్థులకునిత్యం కృత్యం అయిపోయిందని ఆయన ఆరోపించారు. ఇంత జరుగుతున్న పాఠశాల సిబ్బంది హాస్టల్ వార్డెన్ ప్రధానోపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన ఈ పరిస్థితి దాపురించినట్టు ఆరోపించారు. విద్యార్థులను పరామర్శించడానికి వెళ్లిన రేగ కాంతారావు, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు వారుఆరోపించారు. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం వ్యవహారం తీవ్రస్థాయికి చేరినట్టు స్థానికులు కూడా ఆరోపిస్తున్నారు. విద్యార్థులను పరామర్శించేందుకు వెళ్లిన పాఠశాల సిబ్బంది వైద్య సిబ్బంది మీడియా పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు మీడియా ప్రతినిధులు కూడా తీవ్ర స్వరంతో ఆరోపిస్తున్నారు.

**విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురై ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న నలుగురు విద్యార్థులనుఎమ్మెల్యే పరామర్శించి వారినిఅన్ని విధాలుగాఆదుకుంటామని ధైర్యంగా ఉండాలని వాళ్ళకి హామీ ఇవ్వడం జరిగింది. గురుకుల పాఠశాలలో జరిగిన సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని విద్యార్థులు తల్లిదండ్రులు వారి కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

**అర్హులైన ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి**

## ఇందిరమ్మ ఇండ్లు అందించి తీరుతాం





**ఆర్మూర్, మార్చి 9 (నినాదం)** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ స్థలాలు, ఇందిరమ్మ రుణాలు అందించి, అధికారులే దగ్గరుండి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి అందించి వారి కలలు సహకారం చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం దేనని కమ్మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నరసయ్య, వైస్ చైర్మన్ బుచ్చన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బద్దం మైపాల్, ఎం.డి. నవీదు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గిర్మాజి గోపి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పుప్పల అశోక్, మాజీ ఎంపీపీ గిర్మాజి లడ్డు గంగాధర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నాగభూషణం, ఏనుగు మోహన్, లక్ష్మి లు ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ లబ్ధిదారులతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించి,యజ్ఞం,హోమాలు నిర్వహించి సోమవారం రోజున మోర్తాడ్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని వారి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారంలో వచ్చిన తర్వాత, అర్హులైన నిజమైన నిరుపేదలను గుర్తించి ప్రతి ఒక్కరికి నిర్మాణం చేసి అందించడం జరుగుతుందని వారన్నారు. ఇల్లు రాని వారు అధర్య పడవద్దని, విడతలవారీగా ఇల్లులేని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక, మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టిఎన్ జీవో సంఘం క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరణ



**మధిర, మార్చి 9 (నినాదం):** తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీఎన్జీవో) సంఘం మధిర డివిజన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్లు మరియు డైరీలను సోమవారం రోజు మధిరలోని మండల తహసిల్దార్ కార్యాలయం మరియు సబ్ రిజిస్టర్ కార్యాలయం మరియు ఐసిడిఎస్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది, సబ్ రిజిస్టార్ కార్యాలయ సిబ్బంది, ఐసిడిఎస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో మధుర డివిజన్ అధ్యక్షుడు గుర్రం శ్రీనివాస్, కార్యదర్శి రజనీకాంత్, ట్రెజరర్ సాయి, ఈసీ సభ్యుడు సిహెచ్ శ్రీనివాస్, తహసిల్దార్ ఆర్ రాంబాబు, డిప్యూటీ తహసిల్దార్ కరుణాకర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ భాను ప్రసాద్, సబ్ ట్రెజరీ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### డిజిటల్ ప్రపంచంలో
## అప్రమత్తమే కీలకం

**సైబర్ క్రైమ్ డీఎస్పీ**

**ఖమ్మం, మార్చి (నినాదం ):** డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా ఉండేందుకు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండటమేనని సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణిందర్ అన్నారు. కిన్నెర నర్సింగ్ కాలేజీలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ..బ్యాంక్ ఖాతా నుండి డబ్బు పోతే, వెంటనే బ్యాంక్‌కు సమాచారం అందించి ఖాతాను స్తంభింపజేయాలని తెలిపారు.అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయకపోవడం, బలమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించడం, వ్యక్తిగత/బ్యాంకింగ్ సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోకపోవడం ద్వారా ఆన్‌లైన్ మోసాలను అరికట్టవచ్చని అన్నారు. సైబర్ మోసానికి గురైనట్లయితే, వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్ లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.సైబర్ స్టాకింగ్, నకిలీ సోషల్ మీడియా ప్రొఫైల్ మోసం, డిజిటల్ అరెస్ట్,వ్యాపార పెట్టుబడి,లోన్ యాప్, ఆన్‌లైన్ భద్రతా చిట్కాలు, P2M కిసాన్ యోజన అపక్ , బెట్టింగ్ యాప్, డిజిటల్ అరెస్ట్, పెట్టుబడి మోసాలు, 1930, ఎన్ సి ఆర్ పి పోర్టల్ గోల్డెన్ అవర్ యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సైబర్ నేరాలపై విద్యార్థులకు క్విజ్ నిర్వహించారు.విజేతలకు బహుమతులు అందజేశారు.



# ప్రపంచం నెత్తిన చమురు సంక్షోభం!

సంపాదకీయం

చమురు ధరలు దారుణంగా పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. ఇరాన్‌పై యుద్ధం కారణంగా భారత్ సహా అనేక దేశాలు ఇంధన సమస్యలు ఎదుర్కోబోతున్నాయి. ఇప్పటికే గ్యాస్ ధరలు పెంచేశారు. సిలిండర్‌పై 80 రూపాయాలు పెరిగింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో కేవలం గ□హవినయోగ సిలిండర్లనే సరఫరా చేయాలని నిర్ణయించారు. కమర్షియల్ సిలిండర్లపై ఆంక్షలు విధించారు. కేవలం గ□హావస రాలకే సరఫరా చేయాలని దేశాలు ఇచ్చారు. ఇకపోతే విదేశాల్లో సైతం కార్ల ఇంధన ధరలు పెరిగాయి. అమెరికాలోనూ గ్యాస్ ధరలతో అక్కడి వారు గగ్గోలు పెడుతున్నారు. ఇరాన్‌పై అమెరికా`ఇజ్రాయెల్ యుద్ధం కొనసాగుతున్నది. పది రోజులుగా వరుస దాడులు జరుగుతున్నాయి. ఇది ఇంకెంత కాలం సాగుతుందో చెప్పలేం. మర్మజ్ జలసంధి మూసివేత కారణంగా చమురు నౌకలు కదిలే పరిస్థితి లేదు. అందుకే యుద్ధంతో భారత్ చమురు దిగుమతులకు ముప్పు ఏర్పడే ప్రమాదం కనిపిస్తున్నది. యూరప్‌లో చమురు ధరలు బ్యారెల్‌కు 20 డాలర్లు పెరిగి 80 డాలర్లకు చేరింది. హోర్మోజ్ జలసంధి కూడా మూతపడితే 100 డాలర్లకు కూడా చేరే ప్రమాదం పొంచి ఉన్నదని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సూయిజ్ కాలువ, ఎర్ర సముద్రం నౌకాయానానికి తీవ్ర అంతరాయం కలుగుతున్నది. దీంతో ప్రపంచ వాణిజ్యంపై ప్రభావం పడుతున్నది. ఈ మార్గాల్లో భారత్ రోజుకు 26 లక్షల బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకుంటుంది. ఒకవేళ బ్యారెల్‌కు 10 డాలర్ల చొప్పున పెరిగితే, మొత్తం 15 బిలియన్ డాలర్ల అధిక వ్యయం అవుతుంది. పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ ఒపెక్ ఉత్పత్తిని పెంచవచ్చు. కానీ దీర్ఘకాలిక యుద్ధంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగించే ప్రమాదం ఉన్నది. అంతేకాకుండా గల్ఫ్ దేశాలకు ఆర్థిక నష్టాలు, అమెరికా ప్రతిష్ఠకు విఘాతం కలిగే పరిస్థితులు నెలకొన్నాయి. యుద్ధ వాతావరణంతో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌తోపాటు పశ్చిమాసియాలోని ఆర్థిక వ్యవస్థలు, ప్రజల రోజువారీ జీవితాలను సంక్షోభం లోకి నెట్టేలా కనిపిస్తున్నది. ట్రంప్ మూర్ఖపు నిర్ణయం కారణంగా ప్రపంచం మొత్తం ఆర్థిక చక్రబంధంలో ఇరుక్కోవాలసి వస్తోంది. చమురు సరఫరా మార్గాల్లో అంతరాయల వల్ల వాటి ధరలు విపరీతంగా పెరిగి, దీర్ఘకాలికంగా ప్రతికూల ప్రభావం పడుతుంది.చమురు ధరలు పెరగడంతో వాల్‌స్ట్రీట్ 800 పాయింట్లు పడిపోయింది. పెట్రోల్, ఆహారం సహా అన్నింటి ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులు చమురు కంపెనీలకు లాభాలు తెచ్చిపెట్టవచ్చు. కానీ ప్రజలకు ఇబ్బందులు తప్పవు. అమెరికాకు దేశీయంగా చమురు ఉత్పత్తి ఎక్కువగా ఉండటం కొంత ఉపశమనం కావొచ్చు. కానీ ఇరాన్ బలాన్ని పట్టించుకోకపోతే ఇది ఇరాక్ యుద్ధంలా పెద్ద తప్పుగా మారే ప్రమాదం ఉన్నదనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నది. ఈ యుద్ధంలో అణ్వాయుధాల వినియోగం జరిగినా, రష్యా, చైనా ప్రత్యక్షంగా యుద్ధంలోకి దిగినా అత్యంత ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. ఈ యుద్ధం వల్ల జపాన్ వంటి ఆసియా దేశాలు అమెరికాపై నమ్మకం కోల్పోయి డాలర్‌కు దూరమయ్యే ప్రమాదం కూడా ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి. అమెరికా` ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులను తిప్పి కొట్టేందుకు ఇరాన్ చేస్తున్న ప్రతిదాడుల కారణంగానే ఉద్రిక్తతలు ఇప్పట్లో తగ్గేలా లేవు. ఇరాన్ తలొగ్గేది లేదని, లొంగిపోయేది లేదని తేల్చి చెప్పింది. ఇరాన్‌ను ధ్వంసం చేసే వరకు ట్రంప్ నిద్రపోయేలా కనిపించడం లేదు. ఇప్పటికే టర్కీ నుంచి దుబాయి వరకు అమెరికాకు చెందిన సైనిక స్థావరాలు, పోర్టులు, చమురు శుద్ధి కేంద్రాలు, విమానాశ్రయాలు ఇలా 27 ప్రాంతాలపై ఇరాను విరుచుకుపడింది. ఇవన్నీ కూడా తక్కువ ఖర్చుతో కూడిన డ్రోన్‌ల ద్వారానే జరిపినట్టు తెలిసింది. రవాణా మార్గాలపై ఈ దాడులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దుబాయి, సౌదీ అరేబియా కూడా తీవ్రమైన కష్టాల్లో కూరుకుపోయాయి. ఇరాన్ వినియోగిస్తున్న ఆధునిక ఆయుధాలను దుబాయి, సౌదీ అరేబియా బలహీనమైన రక్షణ వ్యవస్థలు దీటుగా ఎదుర్కోలేకపోతున్నాయి. పెద్ద కంపెనీలు కార్యకలాపాలు నిలిపివేశాయి. దుబాయిలోని 50 లక్షల మంది భారతీయులపైనా ప్రభావం పడుతున్నది. ప్రస్తుత యుద్ధం కారణంగా బ్రిటన్, ఫ్రాన్స్ కాలంలో రూపొందిం చిన పాత సరిహద్దులు కూడా మారిపోయే అవకాశం ఉన్నది. సంక్షోభంగా కారణంగా గల్ఫ్ రాజ్యాల్లో నిరుద్యోగం పెరిగితే ప్రజల్లో అసంత□ప్తి వెల్లువెత్తుతుంది. అమెరికా సైన్యం వెనక్కి వెళ్లిపోవాలని ఇరాక్‌లో డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. అమెరికా సైనిక స్థావరాలపై జరిగిన దాడుల పట్ల టర్కీ సంతోషం గానే ఉన్నదని కొందరు భావిస్తున్నారు. యుద్ధ వాతావరణంలో యూరప్ మాటలకే పరిమితమైందని విమర్శలు ఎదుర్కొంటున్నది. భారత్ చౌకైన రష్యా చమురుపై ఆధారపడుతున్నది. చైనా తన వాణిజ్య మార్గాలను, నౌకాశ్రయాలను రక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నది. దాడుల కారణంగా ఇరాన్ ప్రజలు తమ అత్యున్నత నాయకుడిని కోల్పోయారు. ఇరాన్ సైనిక కేంద్రాలపై అమెరికా 1,700 దాడులు చేసింది. ఇరాన్ వ్యూహాత్మకంగా ప్రతిస్పందిస్తున్నది. పర్షియన్ నాగరికతకు చెందిన దీర్ఘ చరిత్ర కారణంగా ప్రజలు ఐక్యంగా నిలుస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను ద□ష్టిలో పెట్టుకొని ఆ దేశంలో పెద్దగా కల్లోలం కనిపించడంలేదు. రష్యా, చైనా మద్దతుతో యుద్ధం నిలువగలిగితే ప్రపంచానికి అది విజయం అవుతుంది.

# రక్తంతో తడిసిన చమురు బావులు!



**ప్రపంచ రాజకీయ పటంలో మధ్యప్రాచ్యం మరోసారి అగ్నికుండగా మారుతోంది. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు కేవలం రెండు దేశాల మధ్య యుద్ధం మాత్రమే కాదు, ప్రపంచ శక్తుల మధ్య ఆధిపత్య పోరాటం కూడా ఇందులో దాగి ఉంది. ప్రపంచ నిరూపిత చమురు నిల్వల్లో దాదాపు 48 శాతం మధ్యప్రాచ్యంలోనే ఉన్నాయని 2023 ఓపెక్ నివేదికలు చెబుతున్నాయి. రోజుకు ప్రపంచం వినియోగించే 100 మిలియన్ బ్యారెల్ల చమురులో దాదాపు 30 శాతం గల్ఫ్ ప్రాంతం నుంచే వస్తోంది. హార్ముజ్ జలసంధి ద్వారా రోజుకు సుమారు 21 మిలియన్ బ్యారెల్ల చమురు రవాణా జరుగుతుందని అమెరికా ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్ వెల్లడించింది. 2022లో రష్యా–ఉక్రెయిన్ యుద్ధం సమయంలో చమురు ధరలు బ్యారెల్□కు 120 డాలర్లను దాటినట్లు అంతర్జాతీయ మార్కెట్ గణాంకాలు చెబుతున్నాయి.**

మూడు దశాబ్దాల విధ్వంసం

మధ్యప్రాచ్య చరిత్రను పరిశీలిస్తే చమురు ఆధిపత్యం కోసం జరిగిన యుద్ధాలే ఎక్కువగా కనిపిస్తాయి. 1991 గల్ఫ్ యుద్ధం సమయంలో ఇరాక్ కువైట్‌పై దాడి చేయడంతో అమెరికా నేతృత్వంలోని అంతర్జాతీయ కూటమి జోక్యం చేసుకుంది. 1991 జనవరి 17 నుంచి ఫిబ్రవరి 28 వరకు జరిగిన యుద్ధంలో కేవలం 42 రోజుల్లోనే 88 వేల టన్నుల బాంబులు పడినట్లు అమెరికా రక్షణ శాఖ నివేదికలు సూచిస్తున్నాయి. 2003 మార్చి 20న అమెరికా నేతృత్వంలో ఇరాక్‌పై దాడి ప్రారంభమైంది. "మాస్ డిస్ట్రక్షన్ వెపన్స్" ఉన్నాయనే ఆరోపణలతో ప్రారంభమైన యుద్ధం ప్రపంచవ్యాప్తంగా విమర్శలకు గురైంది. బ్రౌన్ యూనివర్సిటీ "కాస్ట్స్ ఆఫ్ వార్ ప్రాజెక్ట్" ప్రకారం ఆ యుద్ధానికి మొత్తం ఖర్చు 2 ట్రిలియన్ డాలర్లకు పైగా వెళ్లింది. అలాగే ఇరాక్ యుద్ధంలో 2 లక్షలకుపైగా పౌరులు మరణించినట్లు వివిధ అంతర్జాతీయ అధ్యయనాలు సూచిస్తున్నాయి. యుద్ధాల వెనుక చమురు బావులపై ఆధిపత్యమే ప్రధాన కారణమని అనేక రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

మధ్యప్రాచ్య రాజకీయ సమీకరణాలు

ఇటీవలి సంవత్సరాల్లో మధ్యప్రాచ్య రాజకీయాల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. 2020 సెప్టెంబర్‌లో అమెరికా మధ్యవర్తిత్వంతో జరిగిన "అబ్రహాం అకార్డ్స్" ద్వారా ఇజ్రాయెల్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బహ్రెయిన్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడ్డాయి. తరువాత మొరాకో, సూడాన్ లు చేరాయి. మరోవైపు 2023 మార్చిలో చైనా మధ్యవర్తిత్వంతో ఇరాన్–సౌదీ అరేబియా మధ్య దౌత్య సంబంధాల పునరుద్ధరణ ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం చోటుచేసుకుంటున్న పరిణామాల దృశ్య మధ్యప్రాచ్య రాజకీయ సమీకరణాల్లో పెద్ద మార్పులు చోటుచేసుకునే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ రాజకీయాల్లో చైనా ప్రభావం పెరుగుతున్నదానికి ఇది ఉదాహరణగా చెప్పబడుతోంది. ప్రాంతీయ శక్తి సమీకరణాలు మారడం వల్ల భవిష్యత్తులో కొత్త వ్యూహాత్మక కూటములు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

బిలియన్ల డాలర్ల మార్కెట్

మధ్యప్రాచ్యం ప్రపంచంలో అతిపెద్ద ఆయుధ మార్కెట్లలో ఒకటి. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ 2023 నివేదిక ప్రకారం 2018–2022 మధ్య ప్రపంచ ఆయుధ దిగుమతుల్లో 32 శాతం మధ్యప్రాచ్య దేశాలవే. ముఖ్యంగా సౌదీ అరేబియా ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆయుధ దిగుమతి దేశంగా నిలిచింది. సౌదీ అరేబియా వార్షిక రక్షణ వ్యయం 75 బిలియన్ డాలర్లకు పైగా ఉందని వరల్డ్ బ్యాంక్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఖతర్, యుఏఈ వంటి దేశాలు భారీగా ఆధునిక ఆయుధాలను కొనుగోలు చేస్తున్నాయి. యుద్ధాలు కొనసాగుతున్న కొద్దీ ఆయుధ తయారీ సంస్థల లాభాలు పెరుగుతున్నాయని అంతర్జాతీయ ఆర్థిక విశ్లేషణలు సూచిస్తున్నాయి.

ఉగ్రవాద నిధులపై అనుమానాలు

ఉగ్రవాదం అనే భూతం పుట్టుక వెనుక కూడా ఈ అగ్రరాజ్యాల హస్తం ఉందనేది బహిరంగ రహస్యం. తమకు అనుకూలంగా లేని పాలకులను గద్దె దించడానికి అప్పట్లో ఆయుధాలు నిధులు సమకూర్చిన శక్తులే నేడు ఉగ్రవాదులుగా రూపాంతరం చెందాయి. ఆఫ్ఘనిస్తాన్ లో రష్యాను ఎదుర్కోవడానికి ముజాహిదీన్లను ప్రోత్సహించిన అమెరికా ఆ తర్వాత వారే అల్ ఖైదాగా మారి తనపైనే దాడి చేస్తారని ఊహించలేదు. సిరియా ఇరాక్ లో అంతర్గత అస్థిరతను సృష్టించడం ద్వారానే ఇస్లామిక్ స్టేట్ వంటి ఉగ్రవాద సంస్థలు పుట్టుకొచ్చాయి. భద్రతా సంస్థల అంచనాల ప్రకారం గత 15 సంవత్సరాల్లో ఉగ్రవాద సంస్థల నిధుల్లో సుమారు 30 శాతం అక్రమ వాణిజ్యాల నుంచే వచ్చినట్లు తెలుస్తోంది. ఇందులో చమురు, ఖనిజాలు, ఆయుధాలు కీలక పాత్ర పోషించాయి.

అసలు బాధితులు ప్రజలే

ఐక్యరాజ్యసమితి శరణార్థుల సంస్థ 2024 నివేదిక ప్రకారం సిరియా సంక్షోభం కారణంగా 6.8 మిలియన్ మంది శరణార్థులుగా మారారు. సిరియా అంతర్గత యుద్ధం 2011లో ప్రారంభమైంది. మరోవైపు యెమెన్ యుద్ధం 2015 నుంచి కొనసాగుతోంది. యుద్ధాల వల్ల లక్షలాది పిల్లలు విద్య కోల్పోయారని యునిసెఫ్ నివేదికలు చెబుతున్నాయి. యుద్ధాల వల్ల ఇళ్లు కోల్పోయిన కుటుంబాలు, ఆర్థికంగా కుదేలైన సమాజాలు ఏర్పడ్డాయి. ప్రపంచ శాంతి కోసం రాజకీయ నాయకత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఐక్యరాజ్యసమితి పలుమార్లు హెచ్చరించింది. యుద్ధాలు ఎక్కడ జరిగినా నష్టపోయేది సాధారణ ప్రజలేనన్న కఠిన సత్యాన్ని ప్రపంచం గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది.

**ఫిరోజ్ ఖాన్**
**సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9640466464**

# తిరుపతి జిల్లాలో విషాద ఘటన

## కరెంట్ తీగలకు రెండు ఏనుగులు బలి

తిరుపతి : జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఎర్రావారి పాలెం మండలంలోని నెరబైలు అడవికి సమీపంలో వేటగాళ్లు వేసిన కరెంట్ ఉచ్చులో చిక్కి రెండు ఏనుగులు మ్రుతిచెందాయి. ఈ ఘటన సోమవారం ఉదయం వెలుగులోకి రావడంతో స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం, ఎర్రావారి పాలెం మండలం నెరబైలు అడవికి సమీపంలోని సాయిబులపల్లె ప్రాంతంలో వేటగాళ్లు అక్రమంగా కరెంట్ ఉచ్చులు వేశారు. అడవిలో నుంచి మేత కోసం పొలాల వైపు వచ్చిన రెండు గజరాజులు ఆ కరెంట్ ఉచ్చులో చిక్కి తీవ్ర షాక్‌కు గురై అక్కడికక్కడే మ□తిచెందినట్లు తెలుస్తోంది. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వేటగాళ్లు ఉద్దేశపూర్వకంగా కరెంట్ ఉచ్చు పెట్టడం వల్లనే ఈ ఘటన జరిగి ఉండవచ్చని అటవీ శాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఈ ఘటనకు కారణమైన వేటగాళ్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ అధికారులు వెల్లడించారు.





# ఆధునిక యుగంలో అద్భుత ఆవిష్కరణ దూరవాణి

**మార్చి 10... గ్రాహంబెల్ మొదటిసారి టెలిఫోన్ మాట్లాడిన దినం**

నేడు మనం వాడుతున్న ఫోన్లకు మాతృక అయిన "టెలిఫోన్" అనేదాన్ని కనిపెట్టింది అమెరికాకు చెందిన "అలెగ్జాండర్ గ్రాహెంబెల్" అని మనలో చాలామందికి తెలిసే ఉంటుంది. టెలీ ఫోను అంటే... టెలీ అనగా దూర, ఫోను అంటే వాణి... దూరవాణి అని అర్థం. ఇది సాధారణంగా ఇద్దరు, మరికొన్ని సమయాలలో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది సంభాషించు కునేందుకు ఉపయోగిస్తుంటారన్న సంగతి మనకు తెలిసిందే. అలెగ్జాండర్ గ్రాహెంబెల్ స్కాట్లాండులోని ఎడిన్‌బర్గ్ అనే ప్రాంతంలో మార్చి 3, 1847వ సంవత్సరంలో జన్మించాడు. ఆయన తండ్రి పేరు అలెగ్జాండర్ మెల్‌విల్లే బెల్ (ప్రొఫెసర్) కాగా, తల్లి పేరు ఎలిజా గ్రేస్ గ్రాహెంబెల్. చిన్న వయసు నుంచే సహజంగానే అనేక విషయాల పట్ల ఆసక్తి ఎక్కువగా ఉండేది. ముఖ్యంగా గ్రాహెంబెల్ కు ఆ రోజుల్లోనే పరిశీలనా శక్తి అధికంగా ఉండేది. తన పక్కింట్లో నివాసముండే తన స్నేహితుడు బెన్ హెర్డ్‌మెన్ సహాయంతో గ్రాహెంబెల్ 12 ఏళ్ల ప్రాయంలోనే "ఇన్వెంట్" అనే పేరుతో చిన్న వర్క్‌షాప్‌ను నిర్వహించాడు.

తల్లి క్రమేణా వినికిడి శక్తిని కోల్పోవడంతో ఆమెతో మాట్లాడే క్రమంలో సంజ్ఞలతో భావ వ్యక్తీకరణలో ఆరితేరాడు. ఆమె నుదిటి ఎముకకు దగ్గరగా ఒక రకమైన ఉచ్ఛారణతో మాట్లాడే ప్రయత్నంలో ధ్వని శాస్త్రాన్ని అర్థం చేసుకున్నాడు.

బెల్‌లోని విజ్ఞాన తృష్ణకు తల్లి చెవిటితనం కూడా ఓ కారణం. ఆపై ఎడింబరో విశ్వ విద్యాలయంలో ధ్వని, వినికిడి శాస్త్రాలు చదివి అమెరికాలోని బోస్టన్ విశ్వ విద్యాలయంలో 'గాత్ర సంబంధిత శరీర శాస్త్రం' (వోకల్ ఫిజియాలజీ)లో ప్రొఫెసర్‌గా చేరాడు. భార్య సైతం వినికిడి శక్తిని కోల్పోవడంతో బధిరుల కోసం పరిశోధనలు చేసి, వారు వినగలిగే శబ్ద పరికరాలను రూపొందించాడు. పగలంతా బోధిస్తూ, రాత్రంతా మేలుకుని ప్రయోగాలు చేసేవాడు. ఆ కృషి కారణంగానే తీగల ద్వారా శబ్ద తరంగాలను పంపగలిగే టెలిఫోన్‌ను కనిపెట్ట గలిగాడు.

లోహపు తీగ చుట్టబడిన ఒక శాశ్వత అయస్కాంతం దగ్గర పల్చని ఇనుప రేకును కంపింపజేస్తే, కంపనాల తీవ్రతకు అనుగుణంగా తీగలో విద్యుత్ ప్రవాహం ఏర్పడు తున్నట్లు బెల్ కనుగొన్నా డు. శబ్దాన్ని ప్రసారం చేయటానికి ఈ సిద్ధంతం బాగా ఉపకరిస్తుందని గ్రహించాడు. థామస్ వాట్సన్ అనే మెకానిక్ తో బాటు దీనికి సంబంధించిన ప్రయోగాలు చేసుకుంటూ అతడు పచ్చిక బయళ్ళలో, మైదానాల్లో, బీడు భూముల్లో తిరుగుతుండే వాడు. జీవితంలో ఎన్నో ఒడిదుడు కులు, అపజయం వెక్కిరించాయి. ప్రోత్సహించేవారు కరువయ్యారు. ఎటు చూసినా నిరాశా నిస్పృహలే తారసిల్లాయి. టెలిఫోన్ ద్వారా నోటిమాటల్ని దూర ప్రదేశాలకు అందించే కృషి చేస్తున్నానని చెబితే నలుగురు నవ్విపోతారేమో అని భయ పడుతూ అజ్ఞాతంగా కాలం గడిపేవాడు. కాబోయే మామ కూడా ఇది అంతా ఒక పగటి కల అని కొట్టి పారేశాడు.

1875 జూన్ లో ఒకరోజు వర్క్ షాప్ కి ఇటూ, అటూ ఉన్న రెండు గదుల్లో ప్రసారిణి, రిసీవర్ లను వుంచి వెల్, వాట్సన్ ప్రయోగాలు చేస్తుండగా ఒకదాని ఇనుపరేకు అయస్కాంతానికి అతుక్కు పోయింది. దాన్ని లాగాలని వాట్సన్ ప్రయత్నించినపుడు బెల్ వద్ద వున్న ఇనుపరేకు కూడా కంపించ సాగింది. ఇనుపరేకు దగ్గర చెవి ఉంచగా శబ్దం కూడా వినబడింది. ఒక పక్క ఇనుపరేకును అయస్కాంతానికి చాలా దగ్గరగా ఉంటే ప్రయోగ ఫలితాలు సంతృప్తి కరంగా ఉంటాయని వాళ్ళూ గ్రహించారు. ఇలా కొన్ని నెలలు కృషి చేశాక మొదటి పటిష్ఠమైన టెలిఫోన్ నిర్మించారు. బాటరీ అవసరం లేకుండా ప్రసారిణిలో ఉత్పత్తి అయ్యే అల్ప విద్యుత్ వల్లనే ఇది పనిచేయసాగింది.

1876 మార్చి 10న టెలిఫోన్ ప్రసారిణి బెల్ ఇంటి రెండో అంతస్తు లోనూ, రిసీవర్ ని మొదటి అంతస్తు లోనూ, అమర్చి బెల్ ఫోన్ లో ఇలా మాట్లాడాడు.---"మిస్టర్ వాట్సన్, మీతో పనుంది, పైకి రండి" ---. ఫోన్ లో మాట్లాదిన తొలి పలుకులుగా ఈ పదాలు ప్రసిద్ధి కెక్కాయి. ఒకటి రెండు నిముషాల్లో మెట్లెక్కి రొప్పుతూ, రొజుతూ వాట్సన్ బెల్ వద్దకు పరుగెత్తి వచ్చి "ఫోన్ పనిచేస్తుంది. మీ మాటలు నాకు వినబడ్డాయి."—అని అరిచాడు.

ఇలా కనిపెట్టినదే టెలిఫోను. దీనిని 1876 మార్చి 10న గ్రాహెంబెల్ మొదటిసారిగా ఉపయోగిస్తూ, వాట్సన్‌తో మాట్లాడారు. దీనిపై 1876లో ఆయనకు లభించిన పేటెంట్ అమెరికాలోనే శాస్త్రరంగంలో మొదటిది.

గ్రహంబెల్ ను చాలామంది టెలిఫోన్ ఆవిష్కర్తగా గుర్తుంచుకున్నా ఆయన వివిధ రంగాలలో ఆసక్తిని కనబరచాడు. ఆప్టికల్ టెలి కమ్యూ నికేషన్స్, హైడ్రోఫాయిల్స్, ఏరోనాటిక్స్ రంగాల్లో కూడా అనేక ఆవిష్కరణలు చేశాడు. నేషనల్ జియోగ్రాఫిక్ సొసైటీ వ్యవస్థాప కుల్లో గ్రాహంబెల్ కూడా అయన ఒకరు.

1880 వ సంవత్సరంలో టెలిఫోన్ ఆవిష్కరణకు గాను ఫ్రెంచి ప్రభు త్వం ప్రధానం చేసే వోల్టా పురస్కా రాన్ని గెలుచుకున్నాడు. దీని విలువ 50,000 ఫ్రాంకులు ( సుమారు 10,000 డాలర్లు).

తన జీవిత కాలమంతా రకరకాల పరిశోధనలతో గడిపిన గ్రాహెంబెల్ తన 75 సంవత్సరాల వయసులో చక్కెర వ్యాధికి గురై, 1922 ఆగస్టు 2వ తేదీన మరణించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**



# స్వాతంత్ర్య సమర యోధుడు జి.ఎస్.మేల్కోటే

**మార్చి 10...**
**జి.ఎస్.మేల్కోటే వర్ధంతి**

జి.ఎస్.మేల్కోటే, గా ప్రసిద్ధిచెందిన గోపాలయ్య సుబ్బుకృష్ణ మేల్కోటే సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమర యోధుడు, వైద్యుడు, పరిపాలనా దక్షుడు. ఆయన సుబ్బుకృష్ణ దంపతులకు ఒడిషా రాష్ట్రంలోని బరంపురంలో 1901 అక్టోబరు 17 విజయ దశమి రోజున జన్మించాడు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఎల్.ఎం.ఎస్ పరీక్షలో 1927లో మొదటి తరగతిలో మొదటి వారుగా ఉత్తీర్ణులై బంగారు పతకం అందుకున్నాడు. దేశీయ వైద్య విధానాన్ని, యోగాసనాల ప్రభావా న్ని జోడించి ఉత్తమ వైద్యులుగా ఖ్యాతి పొందాడు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, హైదరా బాదు అధ్యక్షులుగా పనిచేశాడు. ఇతను పతంజలి యోగ పరిశోధనా కేంద్రాన్ని స్థాపించాడు.

స్వతంత్ర భారతదేశంలో ఆయన ఎన్నో బాధ్యతాయుత పదవులు నిర్వహించాడు. హైదరాబాదు శాసనసభలో 1952 నుండి 1956 వరకు సభ్యులై మొదట ప్రజా పనుల శాఖలో తర్వాత ఆర్థిక శాఖలో మంత్రి పదవి నిర్వర్తిం చాడు. ఆయన ముషీరాబాదు నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికయ్యాడు. 1957లో రాయచూరు లోకసభ నియోజకవర్గం నుండి తొలిసారిగా పార్లమెంటుకు ఎన్నికయ్యాడు. 1962 నుండి 1977 వరకు భారత పార్లమెంటు సభ్యుడిగా హైదరాబాదు లోక్‌సభ నియోజకవర్గం నుండి ఎన్నిక య్యాడు. భారత ప్రభుత్వ ప్రతినిధి గా ఆగ్నేయాసియా ప్రాంతీయ ప్రపంచారోగ్య వ్యవస్థాపక మహాసభ, కామన్ వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ లలో పాల్గొన్నాడు. హైదరాబాదు లోని ఐ.ఎన్.టి.యు.సి. శాఖకు అధ్యక్షు లుగా కొంతకాలం పని చేశాడు. ఆయన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు. 1916లో స్వదేశీ ఉద్యమంలో మొదటి సారిగా పాల్గొన్నాడు.

ఉప్పు సత్యాగ్రహంలో తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం వద్ద, కర్ణాటక రాష్ట్రంలోనూ ఉప్పు తయారుచేసి పోలీసులచే నిర్బంధి తుడై హింసలకు గురయ్యాడు. కరాచీ కాంగ్రెస్ లో హైదరాబాదు ప్రతినిధిగా 1931 లో పాల్గొన్నాడు. హైదరాబాదు స్టేట్ కాంగ్రెస్ సభ్యుడై 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నాడు. 1947, ఆగస్టు 15 న జాతీయ స్వాతంత్ర్యం సందర్భం గా భారత జాతీయ పతాకాన్ని హైదరాబాదులో ఎగుర వేయుటకు ప్రయత్నించి నిజాం ప్రభుత్వం చేత జైల్లో నిర్బంధించ బడ్డాడు. పోలీసు చర్య అనంతరం విడుదలయ్యాడు.

ఆయన సతీమణి విమలాబాయి కూడా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది. వీరి మాతృభాష కన్నడం అయినా వీరు ఆంధ్ర దేశానికి చేసిన సేవ గణనీయం. మెల్కొటే 1982 మార్చి 10 వ తేదీన పరమపదించాడు.



# నిద్రలేమితో గుండెకు ముప్పు

నిద్రలేమితో బాధపడే వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుందని చెప్పవచ్చు. నిద్రలేమి కారణంగా అనేక అనారోగ్య సమస్యలను కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. నిద్రలేమి, అబ్ స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా వంటి రెండు సమస్యలతో బాధపడుతున్న వారిలో అధిక రక్తపోటుతో పాటు గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని నిపుణులు పరిశోధనల ద్వారా కనుగొన్నారు.



నిద్రలేమితో బాధపడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందని చెప్పవచ్చు. నిద్రలేమి కారణంగా అనేక అనారోగ్య సమస్యలను కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. నిద్రలేమి, అబ్ స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా వంటి రెండు సమస్యలతో బాధపడ◌ుతున్న వారిలో అధిక రక్తపోటుతో పాటు గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని నిపుణులు పరిశోధనల ద్వారా కనుగొన్నారు. దాదాపు ప్రపంచ వ్యాప్తంగా 32 శాతం మరణాలు నిద్రలేమి కారణంగా వచ్చే గుండెపోటు, స్ట్రోక్ ల కారణంగానే జరుగుతున్నాయని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. నిద్రలేమి , అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా, కోమోర్బిడ్ నిద్రలేమి వంటి సమస్యలతో బాధపడే వారిలో గుండె జబ్బులు వచ్చే అవకాశం మరింత ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.



**నిద్రను కూడా పరిగణనలోకి తీసుకోవాలి..**

సాధారణంగా ఈ రెండు సమస్యలను వేర్వేరుగా గుర్తించి చికిత్స చేస్తారు. కానీ చాలా మందికి ఇవి రెండు ఒకేసారి ఉంటున్నాయని ఇవి రెండు కలిసి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయని నిపుణులు తెలియజేస్తున్నారు. నిద్రించే సమయంలో గుండె, రక్తనాళాలు పునరుద్ధరణ అవుతాయి. కానీ సరిగ్గా నిద్రపోకపోవడం వల్ల గుండెకు సరైన విశ్రాంతి దొరకదు. రక్తనాళాల పనితీరు దెబ్బతింటుంది. గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇతర హృదయ సంబంధ ప్రమాద కారకాల మాదిరిగానే నిద్రను కూడా పరిగణనలోకి తీసుకోవాలని నిద్రలేమి, స్లీప్ అప్నియాను విడిగా కాకుండా కలిపి అంచనా వేయాలని చెబుతున్నారు. నిద్రలేమి వంటి సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స తీసుకోవాలని దీని ద్వారా హృదయ సంబంధ వ్యాధుల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చని సూచిస్తున్నారు. అలాగే వారు గుండె ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు కొన్ని సూచనలు కూడా చేస్తున్నారు. గుండె ఆరోగ్యాన్ని కాపాడే కొన్ని చిట్కాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**పండ్లు, కూరగాయలు అవసరం..**

గుండె ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాలను తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు, గింజలు వంటి సంపూర్ణ ఆహారాన్ని తీసుకోవాలి. ఉప్పు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, ట్రాన్స్ ఫ్యాట్స్, చక్కెరలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం తగ్గించాలి. అలాగే రోజూ వ్యాయామం చేయాలి. నడక, సైక్లింగ్, ఈత, యోగా వంటి వ్యాయామాలు చేయాలి. ఇవి రక్తప◌ోటును తగ్గించడంతోపాటు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ధూమపానాన్ని మానేయాలి. ధూమపానం రక్తనాళాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. గుండె కొట్టుకునే వేగాన్ని పెంచుతుంది. ఆక్సిజన్ స్థాయిలు తగ్గేలా చేస్తుంది. కనుక ధూమపానానికి దూరంగా ఉండాలి.

**ఈ పరీక్షలను తరచూ చేయించుకోవాలి..**

తరచూ లిపిడ్ ప్రొఫైల్, రక్తపోటు, ఈసీజీ వంటి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. వీటి ద్వారా సమస్యను ముందుగానే గుర్తించి తగిన చికిత్స తీసుకోవడానికి వీలుగా ఉంటుంది. అలాగే రోజూ రాత్రి 7 నుండి 8 గంటల పాటు నిద్రపోవాలి. దీని వల్ల ఒత్తిడి తగ్గడంతో పాటు గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. మద్యం రక్తపోటును పెంచుతుంది. కనుక మద్యాన్ని తీసుకోవడం పరిమితం చేయాలి. దీని వల్ల గుండెపై ఒత్తిడి తగ్గుతుంది. ఈ విధంగా రోజూ 7 నుండి 8 గంటల పాటు నిద్రపోవడంతో పాటు ఆహారంలో, జీవనశైలిలో తగిన మార్పులు చేసుకోవడం వల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

## రోగనిరోధక శక్తితో
# అనారోగ్య సమస్యలకు చెక్



శరీరానికి రోగనిరోధక శక్తి ఉండడం చాలా అవసరం. తగినంత రోగనిరోధక శక్తి కలిగి ఉండడం వల్ల ఇన్ఫెక్షన్ ల బారిన పడకుండా ఉంటారు. అలాగే అనారోగ్య సమస్యల నుండి త్వరగా కోలుకోవచ్చు. అయితే ఈ రోగనిరోధక శక్తి రాత్రికి రాత్రే శరీరంలో తయారవ్వదు. ప్రతిరోజూ తీసుకునే ఆహారాల ద్వారా శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుకోవచ్చు.

బలమైన రోగనిరోధక శక్తి విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు, పొట్టలో ఉండే మంచి బ్యాక్టీరియాపై ఆధారపడి ఉంటుంది. రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి మందులు, ఖరీదైన ఉత్పత్తులను వాడాల్సిన అవసరం లేదు. రోజూ తీసుకునే భోజనం ద్వారా కూడా రోగనిరోధక శక్తిని పెంచుకోవచ్చు. సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఇన్ఫెక్షన్ లతో పోరాడే శక్తిని, అనారోగ్యానికి గురి అయినప్పుడు త్వరగా కోలుకునే శక్తిని పొందవచ్చు. రోగనిరోధక శక్తిని సహజంగా పెంచే కొన్ని రకాల ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**పండ్లు, కూరగాయలు..**

నారింజ, నిమ్మకాయలు, బెర్రీలు, పాలకూర, క్యారెట్ వంటి ఆహారాలు విటమిన్ ఎ, సి వంటి పోషకాలను కలిగి ఉంటాయి. వీటితో పాటు రోగనిరోధక శక్తికి మద్దతును ఇచ్చే యాంటీ ఆక్సిడెంట్లను కూడా కలిగి ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. వెల్లుల్లి, అల్లం, పసుపు వంటి పదార్థాలు శరీరం వాపుతో పోరాడడానికి, సహజ రక్షణ ప్రతిస్పందనలకు కావల్సిన మద్దతును ఇస్తాయి. పెరుగు వంటి ఆహారాలను తీసుకోవడం వల్ల పేగు ఆరోగ్యం మెరుగుపడుతుంది. చక్కటి పేగు ఆరోగ్యం రోగనిరోధక శక్తిలో కీలక పాత్ర పోషిస్తుంది. గింజలు, విత్తనాలు వంటి ఆహారాలు జింక్, విటమిన్ ఇలతో పాటు ఆరోగ్యకరమైన కొవ్వులను కలిగి ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తికి మద్దతు ఇవ్వడంలో సహాయపడతాయి.

**అల్లం, పసుపు..**

అలాగే భోజన విషయంలో చాలా మంది చేసే చిన్న ఎంపికలే పెద్ద తేడాను కలిగిస్తాయి. భోజనంలో పండ్లు, కూరగాయలతో పాటు వంటలల్లో పసుపు, అల్లం వంటి వాటిని జోడించడం వల్ల రోగనిరోధక శక్తి క్రమంగా పెరుగుతుంది. అలాగే గుడ్లు, కాయ ధాన్యాలు వంటి ప్రోటీన్ ఉండే ఆహారాలు రోగనిరోధక కణాలను మరమ్మత్తు చేయడంలో వాటిని నిర్మించడంలో దోహదపడతాయి. ఇక ఆహారం ద్వారా రోగనిరోధక శక్తి పెరగడానికి రెండు నుండి నాలుగు వారాల సమయం పడుతుంది. అయితే సమతుల్య ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం చాలా ముఖ్యం. ఇటువంటి ఆహారాలను తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తి మెరుగుపడడంతో పాటు జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుందని, శరీరానికి కావల్సిన శక్తి లభిస్తుందని వైద్యులు చెబుతున్నారు.



## కొబ్బరి నీరు తాగితే కలిగే లాభాలు!

నిద్ర లేచిన తరువాత కొందరు నీరు తాగుతూ ఉంటారు. కొందరు టీ లేదా కాఫీ తాగుతారు. అయితే నీరు లేదా కెఫిన్ కు బదులుగా కొబ్బరి నీరు తాగితే ఏమవుతుందో మీకు తెలుసా. ఉదయం నిద్ర లేచిన తరువాత శరీరం డీహైడ్రేటెడ్ గా ఉంటుంది. కొబ్బరి నీళ్లల్లో పొటాషియం, మెగ్నీషియం వంటి ఎలక్ట్రోలైట్స్ ఉంటాయి. కనుక శరీరం త్వరగా హైడ్రేట్ అవుతుంది. దీంతో శరీరంలో ద్రవ్య సమతుల్యత మెరుగుపడుతుంది. ఉదయం పూట కొబ్బరి నీరు తాగడం వల్ల అలసట తక్కువగా ఉంటుందని కూడా వైద్యులు చెబుతున్నారు. అలాగే కొబ్బరి నీరు పొట్టకు తేలికగా ఉంటుంది. ఉదయం తీసుకోవడం వల్ల ఒత్తిడి లేకుండా జీర్ణవ్యవస్థను మేల్కొలపడానికి ఇది సహాయపడుతుంది. ఉబ్బరం తక్కువగా ఉండడంతో పాటు ప్రేగు కదలికలు ఎక్కువగా ఉంటాయి. అదే విధంగా కొబ్బరి నీరు కణాల హైడ్రేషన్ ను ప్రోత్సహిస్తుంది. ఆక్సిజన్, పోషకాలు శరీరమంతా సమర్థవంతంగా సరఫరా కావడంలో సహాయపడుతుంది. దీని వల్ల శక్తి రోజంతా స్థిరంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.




# వేచి ఉండే సమయం పెంపు..

## వంట గ్యాస్ వినియోగదారుల్లో పెరిగిన ఆందోళన



మిడిల్‌ఈస్ట్ ప్రాంతంలో మారుతున్న యుద్ధ సమీకరణాలు సామాన్యుడి వంటింటిపై ప్రభావం చూపే దశకు చేరాయి. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త దాడుల నేపథ్యంలో అంతర్జాతీయంగా చమురు సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తమైంది. దీని ప్రభావంతో ఎల్‌పీజీ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడి, వంటగ్యాస్ కొరత పెరిగినట్లు కొందరు భావిస్తున్నారు.

గ్యాస్ రీఫిల్ బుక్ చేసిన వినియోగదారులు మునుపటిలా వెంటనే సిలిండర్ పొందే పరిస్థితి లేదు. సరుకు రవాణాలో ఆలస్యం కారణంగా బుకింగ్ చేసిన తర్వాత డెలివరీ కోసం రెండు నుంచి ఎనిమిది రోజుల వరకు వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో సోమవారం ఉదయం నుంచే డీలర్ల వద్ద బుకింగ్‌లు ఒక్కసారిగా రెట్టింపు అయ్యాయి. ముఖ్యంగా రెండు సిలిండర్లు ఉన్న కుటుంబాలు, స్టాక్ అయిపోతుందనే భయంతో డీలర్ అవుట్‌లెట్ల వద్ద క్యూ కడుతున్నారు.

**కమర్షియల్ సిలిండర్ల సరఫరా నిలిపివేత**

హోటళ్లు, రెస్టారెంట్ల పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఆదివారం నుంచి కమర్షియల్ సిలిండర్ల సరఫరాను డీలర్లు పూర్తిగా నిలిపివేశారు. 'కనీసం 14.2 కిలోల డొమెస్టిక్ సిలిండర్లు అయినా అందుబాటులో ఉన్నాయి. కానీ వాణిజ్య సిలిండర్ల సరఫరా ఆగిపోవడం వల్ల హోటల్స్ తీవ్ర సంక్షోభంలో పడుతున్నాయి' అని ఒక సబర్బన్ డీలర్ పేర్కొన్నారు. దీనివల్ల హోటల్ యజమానులు బ్లాక్ మార్కెట్‌లో డొమెస్టిక్ సిలిండర్లను కొనుగోలు చేసే ప్రమాదం ఉందని, అది చట్టవిరుద్ధమే కాకుండా అత్యంత ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**పెరిగిన ధరలు.. కొత్త నిబంధనలు**

సంక్షోభం చాలదన్నట్లు ధరల పెరుగుదలతో వినియోగదారుడిపై మరింత భారం మోపినట్లయింది. ఆదివారం నుంచి కమర్షియల్ సిలిండర్ ధర రూ.115, డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.60 చొప్పున పెరిగింది. కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ జారీ చేసిన తాజా నోటిఫికేషన్ ప్రకారం, ఇకపై దేశీయ వినియోగదారులు ఒక సిలిండర్ తీసుకున్న 21 రోజుల తర్వాత మాత్రమే తదుపరి రీఫిల్ బుక్ చేసుకోవడానికి వీలుంటుంది. గతంలో ఇది 15 రోజులుగా ఉండేది. గతంలో ఉన్న సరళమైన బుకింగ్ సౌకర్యాన్ని ప్రభుత్వం నియంత్రించడం గమనార్హం.

## తగ్గిన బంగారం, వెండి




ఇటీవలి కాలంలో స్థిరంగా కొనసాగుతున్న బంగారం, వెండి ధరలు సోమవారం భారీగా తగ్గాయి. అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ బంగారం, వెండి ధరలు మాత్రం పడిపోతుండడం నిపుణులకు ఆశ్చర్యం కలిగిస్తోంది. గత కొద్ది రోజులుగా తగ్గుతూ వస్తున్న బంగారం, వెండి ధరలు సోమవారం మరింత కిందకు వచ్చాయి. అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ బంగారం, వెండి ధరలు మాత్రం పడిపోతుండడం నిపుణులకు ఆశ్చర్యం కలిగిస్తోంది. సోమవారం వెండి కేజీకి రూ.5 వేల మేర తగ్గింది. మరోవైపు బంగారం ధర కూడా భారీగా తగ్గింది. సోమవారం ఉదయం 10:30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,61,680కు చేరుకుంది. క్రితం ధరతో పోల్చుకుంటే దాదాపు రూ.1960 మేర తగ్గుదల నమోదైంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,200 దగ్గర ఉంది. ఆదివారం ధరతో పోల్చుకుంటే రూ.1800 మేర తగ్గింది. మరోవైపు వెండి కూడా భారీ తగ్గుదల నమోదు చేసింది.

## యుద్ధ ప్రభావంతో భారీగా
# నష్టపోయిన స్టాక్ మార్కెట్లు

### 1,352 పాయింట్లు పతనమైన సెన్సెక్స్... 422 పాయింట్లు తగ్గిన నిఫ్టీ



**జనవరి 5 గరిష్ఠ స్థాయి నుంచి 10 శాతం పడిపోయి కరెక్షన్ జోన్‌లోకి నిఫ్టీ**

**పీఎస్‌యూ బ్యాంక్ షేర్లలో భారీ అమ్మకాలు స్వల్పంగా లాభపడిన ఐటీ రంగం**

**ముడిచమురు ధరలు తగ్గడంతో ఇంట్రాడే కనిష్ఠ స్థాయిల నుంచి కోలుకున్న మార్కెట్లు**

అమెరికా–ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధ ఉద్రిక్తతల కారణంగా భారత స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ పరిణామాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీయడంతో దలాల్ స్ట్రీట్‌లో భారీ అమ్మకాలు వెల్లువెత్తాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 1,352.74 పాయింట్లు పతనమై 77,566.16 వద్ద స్థిరపడింది. అలాగే, ఎన్ఎస్ఈ నిఫ్టీ 422.40 పాయింట్లు నష్టపోయి 24,028.05 వద్ద ముగిసింది. ముఖ్యంగా నిఫ్టీ తన ఆల్ టైమ్ హై నుంచి 10 శాతానికి పైగా పడిపోయి అధికారికంగా 'కరెక్షన్ జోన్'లోకి ప్రవేశించింది. జనవరి 5న నిఫ్టీ 26,373 స్థాయిని తాకిన విషయం తెలిసిందే. అయితే, సెషన్ మధ్యలో ముడిచమురు ధరలు కాస్త తగ్గడంతో మార్కెట్లు ఇంట్రాడే కనిష్ఠ స్థాయిల నుంచి కొంతమేర కోలుకున్నాయి. కనిష్ఠ స్థాయి 23,868 నుంచి నిఫ్టీ 160 పాయింట్లు, 76,424 నుంచి సెన్సెక్స్ 1,142 పాయింట్లు రికవరీ అయ్యాయి. విస్తృత మార్కెట్లలో సైతం నష్టాలు తప్పలేదు. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.97 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.22 శాతం మేర క్షీణించాయి. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లలో తీవ్ర అమ్మకాల ఒత్తిడి కనిపించడంతో పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ అత్యధికంగా 3.97 శాతం పతనమైంది. మరోవైపు, ఐటీ రంగం మాత్రం సానుకూలంగా స్పందించి 0.08 శాతం స్వల్ప లాభంతో ముగిసింది. ప్రస్తుత పరిసితులపై మార్కెట్ నిపుణులు స్పందిస్తూ.. "నిఫ్టీకి 23,700–23,600 వద్ద తక్షణ మద్దతు లభిస్తుంది. ఒకవేళ ఆ స్థాయిని కోల్పోతే 23,400–23,300 వైపు పడిపోయే ప్రమాదం ఉంది. మార్కెట్ కోలుకోవాలంటే 24,300, 24,600 స్థాయిలను దాటాల్సి ఉంటుంది" అని వివరించారు. రాబోయే రోజుల్లో అమెరికా–ఇరాన్ పరిణామాలు, ముడిచమురు ధరల హెచ్చుతగ్గుల పైనే మార్కెట్ కదలికలు ఆధారపడి ఉంటాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# అంతర్జాతీయ మార్కెట్లూ నష్టాల్లోనే..

నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 5.6 శాతం, నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 4 శాతానికి పైగా పడిపోయాయి. నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్ 2.9 శాతం మేర క్షీణించింది. రియల్టీ, లోహ రంగాల్లోనూ అమ్మకాలు వెల్లువెత్తాయి. మార్కెట్ అస్థిరతను కొలిచే విక్స్ 20 శాతానికి పైగా పెరిగి, 24.01కి చేరింది. మరోవైపు ఆసియా మార్కెట్లు కూడా భారీ నష్టాల్లో ఉన్నాయి. దక్షిణకొరియా కోస్పి.. వరుసగా నాలుగు సెషన్లలో రెండోసారి సర్క్యూట్ బ్రేకర్‌ను యాక్టివేట్ చేసింది. ఈ సూచీ 8 శాతం పడిపోవడంతో 20 నిమిషాల పాటు ట్రేడింగ్‌ను నిలిపేశారు. జపాన్ నిక్కీ ఏడు శాతం మేర క్షీణించింది. శుక్రవారం అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగియగా.. నేటి ట్రేడింగ్‌లో ఆసియా సూచీలన్నీ అదే బాటలో కొనసాగుతున్నాయి. అమెరికాకు డో ఫ్యూచర్స్ వెయ్యి పాయింట్లు పడింది.

**ఆయిల్ షాక్..**

పశ్చిమాసియా ఉద్రిక్తతలతో అంతర్జాతీయ చమురు ధరలు ఒక బ్యారెల్‌కు 100 డాలర్ల మార్క్ దాటాయి. దాంతో మదుపర్లు అమ్మకాలకు దిగారు. ద్రవ్యోల్బణ భయాలు అందుకు దోహదం చేశాయి. ఈ ఉద్రిక్తతలు ఎక్కువ కాలం కొనసాగితే.. అది పెద్దచమురు దిగుమతిదారుల్లో ఒకటైన భారత్‌పై పెను ప్రభావం ఉంటుందని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు చెందిన వీకే విజయ్ కుమార్ వెల్లడించారు.

**ఎఫ్ఐఐలు వెనక్కి..**

మన మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత మదుపర్లు (FII) తమ వాటాలను వెనక్కి తీసుకోవడం కొనసాగుతోంది. ఒక్క శుక్రవారమే 6,030 కోట్ల మేర ఉపసంహరించుకున్నారు.





### రెండు నెలలకు సరిపడా
# ఇంధన నిల్వలు

**ఆందోళన వద్దు.. ప్రభుత్వ నివేదిక**

ప్రస్తుతం మన దేశంలో ముడిచమురు, రిఫైన్డ్ పెట్రోలియం ఉత్పత్తుల రూపంలో 250 మిలియన్ బ్యారెల్ల (దాదాపు 4000 కోట్ల లీటర్లు) ఇంధన నిల్వలున్నాయని ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. దేశంలో 25 రోజులకు మాత్రమే సరిపోయే ఇంధన నిల్వలున్నాయనే ప్రచారం తప్పని.. సరఫరా వ్యవస్థలో ఉన్నవి 7–8 వారాల (రెండు నెలల)కు సరిపోతాయని నివేదిక స్పష్టం చేసింది. మంగళూరు, పదూర్, విశాఖపట్నం ప్రాంతాల్లోని వ్యూహాత్మక కేంద్రాలతో పాటు ట్యాంకులు, పైప్‌లైన్లు, సముద్ర నౌకల్లో ఈ నిల్వలున్నాయి.

హర్మూజ్ జలసంధి మీదుగా 40 శాతమే దశాబ్దం క్రితం 27 దేశాల నుంచి చమురు దిగుమతి చేసుకుంటుండగా, ప్రస్తుతం 40 దేశాల నుంచి మనకు చేరుతోంది. మన దేశ చమురు దిగుమతుల్లో 40 శాతమే హర్మూజ్ జలసంధి మీదుగా వస్తోందని, మిగతా 60% రష్యా, పశ్చిమ ఆఫ్రికా, అమెరికా, మధ్య ఆసియా మార్గాల ద్వారా అందుతున్నట్లు నివేదిక స్పష్టం చేసింది. ఒకే సముద్ర మార్గంపై ఆధారపడి, ఇంధన భద్రతపై ఆందోళన చెందే రోజులు పోయాయని వెల్లడించింది. ఇప్పుడు సరఫరా అత్యవసర పరిస్థితులు తలెత్తవని స్పష్టం చేసింది.

**రష్యా నుంచి ఆగలేదు**

మన దేశానికి అతిపెద్ద చమురు సరఫరాదారుగా రష్యా కొనసాగుతోంది. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఒత్తిళ్లున్నా, రష్యా చమురు కొనుగోళ్లకు ఏ దేశం అనుమతిపై భారత్ ఆధారపడలేదు. గత నెలలోనూ రష్యా నుంచి చమురు దిగుమతులు వచ్చాయి అని ప్రభుత్వం వివరించింది. గత నాలుగేళ్లుగా మన దేశంలో చమురు ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. 2022 నుంచి 2026 ఫిబ్రవరి మధ్య ఢిల్లీలో పెట్రోల్ ధర 0.67% తగ్గింది. ఇదే సమయంలో పాకిస్థాన్‌లో 55%, జర్మనీలో 22% పెరిగింది. వినియోగదారులపై ధరల భారం పడకుండా చూడటానికి, పెట్రోల్, డీజిల్‌పై రూ.24,500 కోట్లు, ఎల్‌పీజీపై రూ.40,000 కోట్ల నష్టాలను ప్రభుత్వ రంగ చమురు సంస్థలు భరించాయి.

## ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి ప్రజావాణి

**అదనపు ఎస్పీ రఘునందన్ రావు**

**ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించిన అదనపు ఎస్పీ**

**సమస్యల పరిష్కారానికి ఎస్.హెచ్.ఓలకు ఫోన్ ద్వారా స్పష్టమైన ఆదేశాలు**



**సంగారెడ్డి బ్యూరో, మార్చి 9 (నినాదం):** ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అదనపు ఎస్పీ రఘునందన్ రావ్ తెలియజేశారు. ఈ సందర్భంగా సమస్యలతో జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి స్వయంగా ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని, సమస్యలకు సంబంధించిన అంశాలపై సంబంధిత ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకుని, ప్రతి కేసును నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు పూర్తి న్యాయం చేకూర్చాలని ఆదేశించారు. జిల్లా ప్రజలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, మీ సమస్యలు స్థానిక పోలీస్ స్టేషన్‌లలో పరిష్కారం దొరకనప్పుడు ఎలాంటి భయాలు, ఒత్తిళ్లకు లోనుకాకుండా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజావాణి ద్వారా స్వీకరించిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ, త్వరితగతిన పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

## రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**కాప్రా, మార్చి 9 (నినాదం) :** కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ పరిధిలో రోడ్డు నిర్మాణ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఇందిరా నగర్ లో రూ.44.00 లక్షలు, కృష్ణా నగర్ లో రూ.10.00 లక్షలు, సిల్వర్ ఓక్ కాలనీ లో రూ.14.00 లక్షలు, విద్య మారుతి నగర్‌లో రూ.38.00 లక్షల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పనులు పూర్తి అయిన తరువాత స్థానిక ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ అభిషేక్, బీఆర్ఎస్ పార్టీ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

**కలెక్టర్ ప్రావీణ్య**

**సంగారెడ్డి బ్యూరో, మార్చి 9 (నినాదం):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు పారిశుధ్యం, విద్యార్థులకు అందే సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఇస్నాపూర్‌లోని జెడ్పీ హైస్కూల్ మరియు డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం, పారిశుధ్యం, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా కృషి చేస్తుందన్నారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు చదువుపై మరింత దృష్టి సారించాలని సూచించారు. హాల్ టికెట్లు అందాయా, అందులో వివరాలు సరిగ్గా ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు రివిజన్ చేస్తున్నారా అని ప్రశ్నిస్తూ ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని విద్యార్థులను ప్రోత్సహించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన షెడ్యూల్ సరిగా అమలు కావడం లేదని గుర్తించిన కలెక్టర్, సంబంధిత సంస్థకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు గుడ్లు అందించడం లేదని గమనించి, వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల హెడ్‌మాస్టర్ అనుమతి లేకుండా గైర్హాజరు కావడంపై ఆగ్రహించిన





కలెక్టర్ హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, అదేవిధంగా కొంతమంది ఉపాధ్యాయులు గైర్హాజరు కావడం పై ఎంఈఓ వివరణ ఇవ్వాలని, పర్యవేక్షణ లోపించినందుకు ఎంఈఓకు కూడా షోకాజ్ నోటీసు ఇవ్వాలని జిల్లా విద్యాధికారికి సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని కలెక్టర్ స్పష్టం చేసారు. శానిటేషన్ గ్రాంట్ కింద ఎంత మందిని ఎంగేజ్ చేసుకుంటున్నారో, వారి పేర్లు, ఎప్పటి వరకు పేమెంట్ చేశారన్న వివరాలను అందించాలని సూచించారు. పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేకపోవడం , డైనింగ్ హాల్ సరిగా శుభ్రం చేయకపోవడం పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డును పరిశీలించిన కలెక్టర్, అక్కడ మంటలు చెలరేగిన ప్రాంతాన్ని 24 గంటల్లో వాటర్ ట్యాంకర్ల సహాయంతో పూర్తిగా ఆర్పివేయాలని ఆదేశించారు. సెగ్రిగేషన్ ప్రాంతంలో ఉన్న లెగసీ వ్యర్థాలను 48 గంటల్లో పూర్తిగా తరలించి ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయాలని సూచించారు. డంపింగ్ యార్డ్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అక్రమంగా చెత్త వేయకుండా 24 గంటల పర్యవేక్షణ ఉండేలా ఒక కార్మికుడిని నియమించాలని ఆదేశించారు. అలాగే వ్యర్థాలను సేకరించే మున్సిపల్ ఆటోలు, ప్రైవేట్ వాహనాల ద్వారా చెత్తను ఎక్కడ ప్రాసెస్ చేస్తున్నారు, ఎక్కడికి తరలిస్తున్నారు అనే అంశంపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా అంశాలపై వెంటనే చర్యలు తీసుకొని యాక్షన్ టేకన్ రిపోర్ట్ ను సమర్పించాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. ఈ సందర్భనలో కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్ పర్సన్ సుమలత, మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి కరాటే పోటీల్లో.. సత్తాచాటిన సిద్దిపేట జిల్లా విద్యార్థులు

**దుబ్బాక, మార్చి 9(నినాదం):** రామక్కపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికలు 20 గోల్డ్ మెడల్స్, 22 సిల్వర్ మెడల్స్ ప్రిన్సిపల్ ప్రోత్సాహంతో ముందుకు సాగుతున్న విద్యార్థినిలు కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ జాతీయస్థాయి కరాటే పోటీల్లో సిద్దిపేట జిల్లా విద్యార్థులు సత్తా చాటారనీ యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ వ్యవస్థాపకులు కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ తెలిపారు. కిక్కర్స్ మార్షల్ ఆర్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ లోని కంతేడాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో మూడవ జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ కరాటే పోటీలకు పలు రాష్ట్రాల నుండి సుమారు 2000 మంది విద్యార్థులు పాల్గొని కరాటే పోటీల్లో సిద్దిపేట జిల్లా కి చెందిన 65 మంది విద్యార్థులు 39 గోల్డ్ మెడల్స్, 26 సిల్వర్ మెడల్స్ సాధించారని కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ తెలిపారు. అలానే కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ ని కిక్కర్స్ మార్షల్ ఆర్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ వారు శాలువాతో ఛాంపియన్షిప్ కప్పుతో అలానే మాస్టర్ మెమొంటోతో అభినందించారు. సిద్దిపేట పట్టణంలోని స్ప్రింగ్ డయల్ స్కూల్ 1 గోల్డ్ మెడల్. దుబ్బాక మండలంలోని రామక్కపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల 20 గోల్డ్ మెడల్స్, 22 సిల్వర్ మెడల్స్, దుబ్బాక మునిసిపాలిటీ పరిధిలోని లచ్చ పేట మోడల్ స్కూల్ 3 గోల్డ్ మెడల్స్, 1 సిల్వర్ మెడల్. దుబ్బాక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల 3 గోల్డ్ మెడల్స్,1 సిల్వర్ మెడల్. దిశా స్కూల్ 1 సిల్వర్ మెడల్. మాస్టర్ మైండ్ స్కూల్ 4 గోల్డ్ మెడల్స్, 1 సిల్వర్ మెడల్. మిరుదొడ్డి పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల 8 గోల్డ్



మెడల్స్ సాధించారని మాస్టర్ బురాని శ్రీకాంత్ తెలిపాడు. పథకాలు సాధించిన విద్యార్థులను కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్, సురేందర్ యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఉపాధ్యక్షురాలు మారోజు స్నేహ, డి.ఇ.ఓ శ్రీనివాస్ రెడ్డి, డి.సి.డి.ఓ నర్మద రామక్కపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ శారద వెంకటేష్ ( డి సి ఓ), పిడి రాజేశ్వరి, పిటి పద్మ. లచ్చ పేట మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ బుచ్చిబాబు, పి టి రవీందర్. దుబ్బాక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఎస్ ఓ స్వాతి పిటి నిషా. మిరుదొడ్డి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఎస్. ఓ స్వర్ణలత పిటి భాగ్యమ్మ. దుబ్బాక దిశా స్కూల్ ప్రిన్సిపల్ కమలాకర్, యాదగిరి, ఆనంద్, పిటి నాగేష్ నాగరాజు అభినందించారు.

## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే



**వికారాబాద్, మార్చి 9(నినాదం):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన పథకం ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం ఈ నేపథ్యంలో గూడు లేని పేదలకు ఎంతగానో ఉపయోగ కరంగా మారింది. సోమవారం జిల్లా పరిధిలోని నవాబుపేట మండలం కేశపల్లి లో చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య నిర్మాణం పూర్తయినా ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పేద ప్రజలకు గౌరవప్రదమైన జీవితం అంధించాలనే లక్ష్యంతో నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించడం నాకు చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఒక కుటుంబానికి ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు కాదని అది వారి భవిష్యత్తుకు ఆలయంవంటిదని అన్నారు. ప్రజల సంక్షేమానికే ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. ఈ తరుణంలోనే పేదలందరికీ సొంత ఇల్లు కల్పించాలనే సంకల్పంతో ఈ ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈలాంటి అభివృద్ధి కార్యక్రమాలు మరిన్ని తీసుకువచ్చి చేవెళ్ళ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడానికి ఎప్పుడూ కృషి చేస్తానని అన్నారు. ప్రజలందరి ఆశీర్వాదాలు, సహకారం ఉంటే మంచి పనులు చేయగలుగుతామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు గృహప్రవేశం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నాచారంలో మహిళా దినోత్సవ వేడుకలు

**కాప్రా, మార్చి 9 (నినాదం) :** నాచారం సర్కిల్ నాచారం డివిజన్ లో వి.ఎస్ అహల్య ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిహెచ్ఎంసి మహిళా కార్మికుల అహర్నిశల సేవలను గౌరవిస్తూ చీరల పంపిణీ కార్యక్రమం నాచారం చౌరస్తా లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన మందుముల రాజిత పరమేశ్వర్ రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించి మహిళా కార్మికులను సత్కరించారు. మహిళలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ మహిళా నాయకులకు చీరలు పంపిణీ చేయడం జరిగింది. అనంతరం మహిళలతో కలిసి మహిళా దినోత్సవ కేక్ కట్ చేసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లేబర్ సెల్ ఉపాధ్యక్షులు వి.ఎస్ ప్రకాష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు తుంగ తిరుపతి, జి. కృష్ణా రెడ్డి, బి. శ్రీకాంత్ గౌడ్, రాష్ట్ర ఎస్సీ సెల్ హెచ్.ఆర్ మోహన్, విజయలత అశ్వత్థామ రెడ్డి, సంతోష్ రెడ్డి, సునీల్ రెడ్డి, ఉమా, భవాని గౌడ్, సేవాదళ్ వెంకటేష్, ఫజియుద్దీన్, రఘు, మహేష్ యాదవ్, ప్రేమ్ కుమార్ గౌడ్, అజీమ్, నరసింగ్ రావు, షరీఫ్, గడ్డ క్రాంతి,



శంకర్ గౌడ్, బాలరాజు, నరేష్, సిహెచ్ నరేష్, రవి యాదవ్, ఎండి యూసుఫ్, అశోక్ గౌడ్, శ్రీమంత్ గౌడ్, బాలరాజ్ గౌడ్, బాలు, ఫిరోజ్, రేవంత్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా అవసరాలకు నిలయాలు.. ప్రభుత్వ కార్యాలయాలు






**సజావుగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక**

**ఇంచార్జ్ డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంత**

**జవహర్‌నగర్, మార్చి 9 (నినాదం):** ప్రజా అవసరాలకు నిలయాలుగా ప్రభుత్వ కార్యాలయాలు నిలుస్తున్నాయని, సర్కిల్ పరిధిలో సజావుగా ప్రజాపాలన..... ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం జరుగుతున్నదని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ ఇంచార్జ్ కమిషనర్ ఎన్. వసంత పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా పాలన.... ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం నాలుగవ రోజు కీసర సర్కిల్ పరిధిలోని, అంబేద్కర్ నగర్లోని అంగన్వాడి స్కూల్, బాలాజీ నగర్ లోని విశ్వకర్మ కాలనీ బస్తీ దావకాన, చీర్యాల అంగన్వాడి స్కూల్, కీసర గోధుమ కుంటలోని రైతు వేదిక, చీర్యాల ప్రభుత్వ పాఠశాల తదితర ప్రభుత్వ పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలు బస్తీ దావఖానాలు కమ్యూనిటీ హాల్స్ ను పారిశుద్ధ్య సిబ్బందిచే శుభ్రం చేయడం జరిగిందని తెలిపారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం సర్కిల్ పరిధిలో శరవేగంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం స్వచ్ఛతకు పెద్దపీట వేస్తుంది అనడంలో సందేహం లేదని పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఎం ఆదేశించిన నేపథ్యంలో పారిశుద్ధ్య పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. రోడ్లపై చెత్త పేరుకుపోయిన చెత్త బిన్స్ నిండిపోయిన నాలాల్లో వ్యర్థాలు ఉన్న ఫోటో తీసి లొకేషన్ తో అధికారులకు తెలియజేస్తే వెంటనే సిబ్బంది స్పందించి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు.

# రైల్వే గేట్ ఫ్రీ మల్కాజ్‌గిరి కోసం కృషి

**సౌత్ సెంట్రల్ రైల్వే జీఎంను కలిసిన ఎమ్మెల్యే**



**అల్వాల్, మార్చి 9 (నినాదం):** మల్కాజ్‌గిరి నియోజకవర్గాన్ని రైల్వే గేట్ల సమస్యల నుండి విముక్తి చేసి "రైల్వే గేట్ ఫ్రీ మల్కాజ్‌గిరి"గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సికింద్రాబాద్‌లోని రైల్వే నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవని మర్యాద పూర్వకంగా కలిసి పలు కుంశాలపై వినతిపత్రం అందజేశారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో రైల్వే లెవెల్ క్రాసింగ్‌ల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం పలు అభ్యర్థనలు చేశారు. మచ్చ బొల్లారం డివిజన్‌లోని రైల్వే బజార్ రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే టన్నెల్ నిర్మాణం చేపట్టాలి. ఎల్ సి 250 బొల్లారం రైల్వే స్టేషన్ వద్ద ప్రతిపాదించిన ఆర్ఓబి బదులు ఆర్‌యుబి నిర్మించాలి.

తుర్కపల్లి, జనప్రియ మచ్చ బొల్లారం చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేయాలి. ఈ అంశాలపై స్పందించిన సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ సానుకూలంగా స్పందించి, త్వరలో సంబంధిత శాఖలతో జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు కిరణ్, శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, నేమూరి శ్రీధర్ గౌడ్, అమీనుద్దీన్, చిన్న యాదవ్, హేమంత్ పటేల్, బైరు అనిల్, వెంకటేష్, నర్సింగ్ రావు, రవీందర్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి





**మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టర్ మనుచౌదరి**

**అల్వాల్, మార్చి 9 (నినాదం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వందివ్యాంగులకు ప్రభుత్వం అందించే ట్రైసైకిళ్లు, వీల్ సైకిళ్లను సరైన విధంగా వినియోగించుకొని జీవితంలో ఆర్థికంగా ఎదగాలని అందుకు మీకు అవసరమైన మార్గనిర్దేశాలను, సహాయ సహకారాలను అందించేందుకు ఎల్లవేళల ముందుంటుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. సోమవారం అల్వాల్ లోని సఖీ సెంటర్ లో జిల్లా మహిళా శిశు వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివ్యాంగులకు ట్రై సైకిళ్లు 56, వీల్ సైకిళ్లు 14 పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ మను చౌదరి ముఖ్య అతిథిగా విచ్చేసినారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్, ఆర్డీఓ ఓం ప్రకాష్, అల్వాల్ తహసీల్దారు రాములు, డిడబ్లూఓ శారద, హాజరైనారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు శారీరకంగా ఇబ్బందులు ఉన్నప్పటికి మానసికంగా ధైర్యంగా ఉంటూతమలక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు వెళ్లాలని, అందుకు అవసరమైన సహాయ సహకారాన్ని తప్పకుండా అందిస్తామని కలెక్టర్ తెలిపారు. మానసికంగా ధైర్యంగాఉంటే అంగవైకల్యం అడ్డంకి కాదని, అన్నిరంగాలలో మీరు రాణించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ రోజు ఒక పరిస్థితిలో ఉన్నాము, రేపటికి దీనికంటే మెరుగుగా ఉండాలనే ఆలోచనలు మీలో ఉంటే మీ ఆలోచనలకు కార్యరూపం అందించేందుకు ఎల్లవేళలమేముమీవెంట ఉంటామని కలెక్టర్ అన్నారు. మీరు ఆర్థికంగా ఎదగడానికి అనేక ఆలోచనలు ఉంటాయి, సొంతంగా బిజినెస్, సొంతంగా దుకాణం పెట్టుకోవడానికి ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారం అందిస్తామన్నారు. మీ పిల్లలు ఎక్కడైనా చదువుతూ కెరీర్ కౌన్సెలింగ్, కోర్సెస్ నేర్చుకోవడానికి స్కిల్ డెవలప్ మెంట్ వంటి వాటిని ఇంప్రూవ్ చేసి వివిధ రంగాలలో రాణించడానికి కావలసిన సామర్థ్యాన్ని పెంపొందించడానికి తప్పకుండా వారికి సహకారం అందిస్తూ తోడ్పడతామని కలెక్టర్ అన్నారు. మీ పిల్లలను చదివించడంలో వారికి కెరీర్ నిర్మాణంలో కూడా మీకు కావలసిన కౌన్సిలింగ్ కు మార్గనిర్దేశాన్ని అందించడమే కాకుండా ప్రభుత్వ మార్గనిర్దేశాల మేరకు ఆర్థిక సహాయం కూడా అందిస్తామన్నారు. ఈసారి వీల్ ఛైర్లు, ట్రై సైకిళ్లు అందని వారికి తప్పకుండా తదుపరి అందించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తో కలిసి కలెక్టర్ దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, వీల్ ఛైర్లు పంపిణీ చేసారు. కలెక్టర్ సఖి సెంటర్ పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## కాలనీల పరిశుభ్రత కోసం కాలనీ సంఘాల తోడ్పాటు ఎంతో అవసరం

**డిసి బోగేశ్వర్లు**



**అల్వాల్, మార్చి 9 (నినాదం):** కాలనీల పరిశుభ్రత కోసం కాలనీ సంఘాల తోడ్పాటు ఎంతో అవసరమని డిసి భోగేశ్వర్లు అన్నారు. అల్వాల్ జిహెచ్ఎంసి పరిధిలోని మచ్చబొల్లారం డివిజన్ ప్రెసిడెన్సీ కాలనీ పార్కుజిహెచ్ఎంసిలో ప్రభుత్వం తలపెట్టిన 90 రోజుల ప్రణాళిక లో భాగంగాఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ సభ్యులు మరియు కాలనీ వాసులు అందరూ కలిసి మా కాలనీలో జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్రా శ్రీనివాస్ రెడ్డి,బాల్ రెడ్డి,కులకర్ణి,వెంకట్ రెడ్డి,రవీందర్ రెడ్డి,రమణా రెడ్డి,రాజేశ్వర్ రెడ్డి,నరేష్ రావు,జయరాం,శ్రవణ్ రెడ్డి,వీరా రెడ్డి,తదితరులు పాల్గొన్నారు

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ఉమాశంకర్ ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

**వికారాబాద్, మార్చి 9(నినాదం ):** వికారాబాద్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ఉమా శంకర్ ప్రసాద్ సోమవారం భాదత్యలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రదీప్ తివారి నిమర్యాదపూర్వకంగా కలసి బొకే అందజేశారు. పలు విషయాలు పంచుకున్నారు.



## ప్రభుత్వ ఆసుపత్రిలో ఉమెన్స్ డే వేడుకలు




**అల్వాల్, మార్చి9 (నినాదం):** అల్వాల్ ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన ఉమెన్స్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన డి ఎం హెచ్ ఓ డిస్టిక్ మెడికల్ ఆఫీసర్ ఉమా గౌరీ మరియు డిప్యూటీ డిఎంహెచ్ఓ లావణ్య కేక్ కట్ చేసి డాక్టర్ ఉమా గౌరీ డాక్టర్ లావణ్య లను సత్కరించి బహుమతులను అందజేసిన స్థానిక డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ అనగ్, డాక్టర్ శైలజ, అరుణ ,సృజన, సంగీత ,మరియు మెడికల్ సిబ్బంది ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

**కరీంనగర్‌లో 2 కి.మీ పరుగు, ఈ-వ్యర్థాల సేకరణ ప్రారంభం**

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నగరంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు**

**నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్, మార్చి 9(నినాదం )**

కరీంనగర్ నగరంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్య నారాయణ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం నగ రపాలక సంస్థ ఆధ్వర్యంలో 2 కిలోమీటర్ల పరుగు కార్యక్రమం, ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి కలెక్టరేట్ మీదుగా అంబేద్కర్ స్టేడియం వరకు నిర్వహించిన ఈ పరుగు కార్యక్రమాన్ని మేయర్ కొలగాని శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారా యణ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. నగరపాలక సంస్థ ఉద్యోగులు, విద్యార్థులు, పోలీసు శిక్షణ సిబ్బంది, వాకర్స్ అసోసి యేషన్ సభ్యులు పాల్గొన్నారు.అనంతరం అంబేద్కర్ స్టేడియంలో వాకర్లతో కలిసి పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. స్టేడియం పరిసరాల్లో ఉన్న ప్లాస్టిక్, గాజు వ్యర్థాలను సేకరించి, కలుపు మొక్కలను తొల గించారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. నగరంలోని 66 డివిజన్లలో ప్రణాళిక ప్రకారం పారిశుధ్య పనులు నిర్వహిస్తూ ప్రతి రోజు ఐదు డివిజన్లను ఎంపిక చేసి అదనపు కార్మికులతో డ్రైనేజీలు, పరిసరాలను శుభ్రం చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ కమ్యూనిటీ భవనాలు, బస్తీ దవాఖానాలు, పాఠశాలలు వంటి భవనాలను కూడా శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటు న్నామని, ప్రతి డివిజన్‌కు అవసరాలకు అనుగుణంగా ఐదు లక్షల రూపాయల నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజలు కూడా పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, స్వచ్ఛ సర్వేక్షణలో నగరానికి మంచి స్థానం రావడానికి సహకరించాలని కోరారు.ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం, ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రజా పాలన కార్యక్రమం ద్వారా నగరంలో ప్రణాళికాబద్ధంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతు న్నామని తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్ర మంలో భాగంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ కార్యక్ర మాన్ని ప్రారంభించామని తెలిపారు. ఇంట్లో ఉన్న ఎల క్ట్రానిక్ వ్యర్థాలను బయట వేయకుండా నగరపాలక సంస్థ కార్మికులకు అందించాలని ప్రజలను కోరారు. నగర అభివృద్ధితో పాటు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రతి రోజు ఐదు డివిజన్లలో ప్రత్యేక కార్యక్ర మాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, మార్చి 6 నుంచి జూన్ 2 వరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వరకు 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రజల సమస్యలను పరిష్క రించేందుకు ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళి కను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసు శిక్షణ సిబ్బంది, విద్యార్థులు, వాకర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 14న బండి సంజయ్ మహా పాదయాత్ర

**అంజన్న ఆశీర్వాద యాత్రకు శ్రీకారం**

**కరీంనగర్ మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టు అంజన్న ఆలయం వరకు సుమారు 40 కిలోమీటర్ల కాలినడక యాత్ర**

**కరీంనగర్, మార్చి 9(నినాదం )**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈ నెల 14న అంజన్న ఆశీర్వాద యాత్ర పేరిట మహా పాదయాత్ర చేపట్టనున్నారు. కరీంన గర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, ఉపస ర్పంచులు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మేయర్, ఉప మేయర్‌లతో కలిసి ఆయన ఈ యాత్రలో పాల్గొననున్నారు. దాదాపు 10 వేల మంది కార్యకర్తలు ఈ పాదయాత్రలో పాల్గొనేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కరీంనగర్ మేయర్ పదవి బీజేపీకి వస్తే కొండగట్టు అంజన్న ఆలయానికి కాలినడకన వెళ్లి మొక్కులు తీర్చుకుం టానని బండి సంజయ్ ప్రకటించారు. ప్రజలు బీజేపీకి మేయర్ పీఠాన్ని అందించడంతో పాటు పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కూడా ఎక్కువ స్థానాల్లో గెలిపించడంతో ఇచ్చిన మాటను నిలబె ట్టుకు నేందుకు ఈ పాదయాత్ర చేపడుతున్నారు.ఈ యాత్ర 14న ఉదయం 7 గంటలకు కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం వద్ద ప్రారంభ



మవుతుంది. అక్కడి నుంచి రేకుర్తి, కొత్తపల్లి, గంగాధర, కొడిమ్యాల, మల్యాల మార్గంగా కొండగట్టు అంజన్న ఆలయానికి చేరుకుంటారు. సుమారు 40 కిలోమీటర్ల మేర కాలినడకన సాగనున్న ఈ యాత్ర సాయంత్రం వరకు ముగియ నుంది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకోనున్నారు. పాదయాత్ర ఏర్పాట్ల కోసం డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో భండారి శాంతికుమార్, మోహన్ రెడ్డి, గంగాడి కృష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపి, బోయినపల్లి ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు. కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, ఉప మేయర్ సునీల్ రావు కూడా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. భక్తి గీతాలు, డప్పు చప్పుళ్ల మధ్య ఆధ్యాత్మిక వాతావరణంలో ఈ పాదయాత్ర సాగుతుందని నిర్వాహకులు తెలిపారు. మార్గమధ్యంలోని గ్రామాలు మంగళహారతులు, పూలతో స్వాగతం పలికేందుకు సిద్ధమవుతున్నాయి. యాత్రలో పాల్గొనే వారికి మంచినీరు, మజ్జిగ, పులిహోర వంటి ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.

## శాఖల వారీగా ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత

**ప్రజావాణికి 352 దరఖాస్తులు స్వీకరణ: జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్, మార్చి 9(నినాదం )**



ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రజల సమస్యల పరి ష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సభా మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు ప్రజావాణి దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. తమ పరిధిలో లేని దరఖాస్తులను సంబంధిత శాఖలకు బదిలీ చేసి, ప్రతి అంశాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై సమీక్ష నిర్వ హిస్తామని, ఎలాంటి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచవద్దని స్పష్టం చేశారు. సోమవారం రోజున నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 352 దరఖాస్తులు అందాయి. కార్యక్రమంలో పాల్గొన్న వృద్ధులు, దివ్యాంగుల వద్దకే వెళ్లి జిల్లా కలెక్టర్ స్వయంగా వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, రెవెన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## దుండగుల దుశ్చర్య... రాజీవ్ గాంధీ విగ్రహానికి చెప్పులు

**నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు పాషా..**

**మెట్‌పల్లి, మార్చి 9 (నినాదం)**



ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామంలో భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహానికి చెప్పులు తొడిగిన ఘటనపై మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఖుతు బోద్దీన్ పాషా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం విలేక రులతో మాట్లాడుతూ శనివారం రాత్రి గుర్తుతె లియని వ్యక్తులు రాజీవ్ గాంధీ విగ్రహానికి చెప్పులు తొడగడం క్షమించరాని చర్య అని అన్నారు. దేశానికి సేవలు చేసిన మాజీ ప్రధాని విగ్రహాన్ని అవమానించడం అనైతికమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఉద్యమకారులు ధ్వంసం చేశారని, స్థానిక కాంగ్రెస్ నాయకుల సహకారంతో ఇటీవల దానిని మరమ్మతులు చేయించామని తెలిపారు. ఈ నేపథ్యంలో మళ్లీ ఇలాంటి ఘటన జరగడం బాధాకరమని అన్నారు. దేశానికి వన్నె తెచ్చిన నాయకుడు రాజీవ్ గాంధీ అని పేర్కొంటూ, రాష్ట్రాన్ని ప్రగ తిపథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ఇటువంటి చర్యలకు పాల్ప డుతున్న నిందితులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరని హెచ్చరించారు. పోలీసు అధికా రులు వెంటనే దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

**జమ్మికుంట, మార్చి 9 (నినాదం)**

ఇల్లందకుంట మండలంలోని బూజులూరు ప్రభుత్వ పాఠశాలలో 1982 –83 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలుసుకున్నారు. దాదాపు 44 సంవత్స రాల తర్వాత ఒకే చోట చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ ఆనందోత్సవాలతో స్నేహస్ఫూర్తిని మరింత బలపరిచే విధంగా ఆత్మీయ పలకరింపుల మధ్య సమ్మేళనాన్ని అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంపత్ రెడ్డి లక్ష్మీనారాయణ ,మల్లారెడ్డి, జలంధర్ ,పద్మ, మధుసూదన్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## నేడు బాధ్యతలు స్వీకరించనున్న హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్

**హాజరుకానున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్**

**జమ్మికుంట, మార్చి 9 (నినాదం)**



హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన రొంటాల సుహాసిని మనోజ్ నేడు పదవి బాధ్యతలు స్వీకరించనున్నారు. హుజురాబాద్ మునిసిపల్ చైర్మన్గా కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి రొంటాల సుహాసిని ఎన్నికైన విషయం తెలిసిందే. అనంతరం ప్రమాణ స్వీకారం చేసినప్పటికీ తాను పూర్తిస్థాయిలో బాధ్యతలు స్వీకరిం చలేదు. నేడు మున్సిపల్ కార్యాలయంలో పదవి బాధ్యతలు ఆమె చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ జిల్లా డిసిసి అధ్యక్షులు మేడిపల్లి సత్యం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారా యణ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం హుజురా బాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్ బాబు హాజరు కానున్నారు. ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీ కార్య కర్తలు నాయకులు హాజరై విజయవంతం చేయాలని ప్రణవ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు.



## వికాస్ హైస్కూల్‌లో ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం

**విద్యార్థుల విజ్ఞాన నమూనాలు ఆకట్టుకున్న వేడుక**

**కరీంనగర్ , మార్చి 9(నినాదం )**

ఆసిఫ్‌నగర్‌లోని వికాస్ హైస్కూల్‌లో జాతీయ విజ్ఞాన దినోత్స వాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యా అధికారి ఆనందం ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల ప్రతిభను అభినందించారు. మొదటి తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులు పర్యావరణ సంరక్షణ, శక్తి ఆదా వంటి అంశాలపై రూపొందించిన వివిధ విజ్ఞాన నమూనా లను ప్రదర్శించారు. ఈ నమూనాలు అతిథులు, ఉపాధ్యాయులను ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా ఆనందం మాట్లాడుతూ, విద్యా ర్థులు విజ్ఞానంపై ఆసక్తి పెంపొందించుకుని సమాజానికి ఉపయో గపడే ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని సూచించారు. పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు శారదా శ్రీనివాస్ అతిథిని స్వాగతిస్తూ, విద్యార్థులు విజ్ఞాన రంగంలో రాణించేందుకు పాఠశాల తరపున ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.చివరిగా ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేసి కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు.

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ వినతి

**ధర్మపురి మార్చి 9 ( నినాదం)**



పిల్లల నిరాదరణకు గురవుతున్న వయోవృద్ధులకు ఆసరాగా నిలుస్తున్న తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ప్రతినిధులకు జిల్లాలోని మున్సిపాలిటీల్లో కోఆప్షన్ సభ్యులుగా నియమించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను అసోసి యేషన్ ప్రతినిధులు కోరారు. సోమవారం ధర్మపురిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతినిధులు మంత్రిని కలిసి తమ సమస్యలను వివరించారు.<ఈ సందర్భంగా అసోసియే షన్ తరపున మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీల్లో సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ప్రతినిధులను కోఆప్షన్ సభ్యులుగా నియ మించాలని కోరారు. అదేవిధంగా జగిత్యాల జిల్లా కేంద్రంలో సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా కార్యాలయం మరియు కౌన్సిలింగ్ కేంద్రం ఏర్పాటు కోసం దరూర్ క్యాంపులో ఐదు గుంటల ప్రభుత్వ స్థలం కేటాయించాలని, భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా కొంతకాలంగా నిలిచిపోయిన సీనియర్ సిటిజెన్స్ గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియను తిరిగి ప్రారంభించి వృద్ధులకు అందజేయాలని వినతి పత్రంలో కోరారు. వారి సమస్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సాను కూలంగా స్పందించి పరిష్కారం దిశగా చర్యలు తీసు కుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అసోసియే షన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లా కేంద్రంలో సుమారు కోటిన్నర రూపాయల వ్యయంతో వృద్ధాశ్రమం మరియు డే కేర్ కేంద్రం ఏర్పాటు చేయడానికి మంత్రి సహకరించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపా ధ్యక్షులు పి.సి. హన్మంత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, ఎం.డి. యాకూబ్, కార్యదర్శి గౌరిశెట్టి విశ్వ నాథం, కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం, మెట్‌పల్లి అధ్యక్షులు వొజ్జల బుచ్చిరెడ్డి, ధర్మపురి అధ్యక్షులు కండ్లె గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## అపర భద్రాద్రి దేవస్థానంలో అవకతవకలు

**దేవాదాయ శాఖ అధికారులకు వినతి పత్రం: చైర్మన్ ఇంగిలే రామారావు**





**జమ్మికుంట, మార్చి 9 (నినాదం)**

అపర భద్రాద్రిగా ప్రసిద్ధి చెందిన ఇల్లంతకుంట శ్రీ సీతారా మచంద్రస్వామి దేవస్థానంలో జరుగుతున్న అవినీతి అక్ర మాలపై సమగ్ర విచారణ జరపాలని దేవాలయ చైర్మన్ ఇంగిలి రామారావు జిల్లా కలెక్టర్ తో పాటు దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ , అసిస్టెంట్ కమిష నర్లను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లందకుంట దేవస్థానానికి శాశ్వత కార్య నిర్వహణ అధికారిని ఏర్పాటు చేయడంతో పాటు దేవాలయానికి సంబంధించిన పలు అంశాల్లో పారదర్శ కత లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దేవస్థానానికి సంబంధించిన స్థలాలను లీజుకిస్తూ ఆలయానికి గండి పెడుతున్నారని, గతంలో ఇచ్చిన వారికే లడ్డు పులిహోర తయారీ పనులు అప్పగిం చడంతోపాటు వివాహ కార్యక్రమాలకు సంబంధించిన అధికార మసీదులు ఇవ్వకుండా ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నాసంబంధించి– 25 సంవత్సరానికి సంబంధించి మహోత్సవాల హుండీ లెక్కింపు కూడా ఇప్పటివరకు ఇవ్వలేదని, దేవస్థానంలో ఇద్దరు అధికారులు ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తూ ఆలయ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని చైర్మన్ రామారావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేశారు.

# జమ్మికుంటలో 2కే రన్

**వాట్సాప్ మెసేజ్ కి స్పందించిన చైర్మన్.. ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే సహించేది లేదు**

**ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దు: మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్**

**జమ్మికుంట, మార్చి 9 (నినాదం)**





తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా తీసుకున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 2కే రన్ కార్యక్ర మంలో పాల్గొన్న చైర్మన్ ప్రశాంత్ కుమార్. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళి కలో భాగంగా 99 రోజుల కార్యక్ర మాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. దీనిలో భాగంగా ప్రజా ఆరోగ్యం సంక్షేమం ముఖ్యమని భావించి మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో 2కే రన్ కార్యక్రమాన్ని స్థానిక డిగ్రీ కళాశాల మైదానం నుంచి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులలో గల సమస్యలను తెలుసు కుంటూ సమస్యల పరిష్కారం కోసం తీసుకోవలసిన చర్యలను గురించి అధికా రులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ నివేదికలు తయారు చేయడం జరుగు తుందని వెల్లడించారు. ప్రజలకు ఏ చిన్న సమస్యలు ఉన్న ఫోన్ ద్వారా గాని వాట్సాప్ ద్వారా గాని సమాచారం అందించినట్లయితే వెంటనే తక్షణ చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జమ్మికుంట పట్టణంలోని మహిళా సంఘ భవనం కబ్జాకు గురైందని అప్లికేషన్ రావడంతో వెంటనే స్పందించిన మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ 28వ వార్డులో గల మహిళా సంఘ భవనానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘానికి కేటాయించిన భవనం పుర పాలక సంఘం ఆధీనంలో ఉందని ఆ స్థలాన్ని ఎవరైనా కబ్జా చేయాలని ప్రయత్నం చేసిన చర్యలు తీసుకుంటా మని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మున్సిపాలిటీకి సంబంధించిన నిధులతో మహిళా సంఘ భవనాన్ని నిర్మాణంలో నికి తీసుకొని వచ్చి అందరికి ఉపయోగ పడేలా చేస్తామని పేర్కొన్నారు. కార్యక్ర మంలో వార్డు కౌన్సిలర్లు దిడ్డి కోమల, ఒగ్గు రమేష్ ,మాచర్ల రాజు, చింతల శ్రీనివాస్, నాయకులు రామ్మోహన్ మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి సానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్ రాజకుమార్ వికాస్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి మెడలో గొలుసు దొంగిలించిన గుర్తు తెలియని వ్యక్తులు

**జమ్మికుంట, మార్చి 9 (నినాదం)**



వీణవంక మండలం లోని శ్రీరాములపేట గ్రామానికి చెందిన నార్ల కనకమ్మ అనే వృద్ధురాలు మెడలో నుండి రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడును గుర్తుతెలియని దుండగులు దొంగిలిం చుకుని పోయారు. వృద్ధురాలు ఇంటిలో ఉండగా ఇంటిలోకి ప్రవేశించిన దొంగలు పుస్తెలతాడు తెంపుకొని పోయారని ఫిర్యాదు చేయడంతో జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.




## సామాజిక మార్పుతోనే మహిళల్లో నిజమైన సాధికారత...

**మహిళలు ఎదుర్కొనే సమస్యలకు చట్టపరమైన రక్షణ కోసం లీగల్ సర్వీసెస్ కేంద్రాలను సంప్రదించాలి**

**సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు**

**మెట్‌పల్లి, మార్చి 9 ( నినాదం)**

సామాజిక మార్పు వచ్చినప్పుడే మహిళల్లో నిజమైన సాధికారత సాధ్యమవుతుందని మెట్‌పల్లి సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు అన్నారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం మండల్ లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వ హించిన ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల రక్షణ కోసం ఎన్నో చట్టాలు ఉన్నప్పటికీ, సమాజంలో వచ్చే మార్పులే మహిళలకు నిజమైన సాధికారతను అందిస్తాయని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ముందడుగు వేస్తున్నప్పటికీ, పనిచేసే ప్రదేశాల్లో కొంతమంది లైంగిక వేధింపులను ఎదుర్కోవడం దురదృష్టకరమని అన్నారు. అలాంటి పరిస్థితులను ఎదుర్కొనే ఉద్యోగినులు చట్టపర మైన సహాయం కోసం మండల న్యాయ సేవా కేంద్రాలను సంప్రదిం చాలని సూచించారు. పురుషులకన్నా తాము తక్కువేమీ కాదనే భావన మహిళల్లో పెరగాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందితే సమాజంలో మరింత మార్పు వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్ కుమార్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్ గౌడ్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. ప్రణయ్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, కోశాధికారి పడిగెల శ్రీనివాస్, క్రీడా కార్యదర్శి బిగుల్లా శంకర్, మహిళా న్యాయ వాదులు మామిడిపల్లి విజయలక్ష్మి , కాజీపేట స్రవంతి, మెడిచెల్మల సుమలత, మాలేపు సంధ్యారాణి, లోకిని హరిచందన, సూపరింటెం డెంట్ వసంత, కోర్టు సిబ్బంది ఇందిర, విజయలక్ష్మి , భాగ్యలక్ష్మి , మనీషా, సుష్మ, స్వాతి, సరిత, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు ఉపశమనం కల్పించాలి

**పెనాల్టీ, వడ్డీ మాఫీ చేసి నాలుగు వాయిదాలలో బియ్యం బకాయిలు చెల్లించే అవకాశం ఇవ్వాలని కలెక్టర్‌కు మిల్లర్ల విజ్ఞప్తి**

**కరీంనగర్, మార్చి 9 (నినాదం)**



తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్స్ సంఘం పిలుపు మేరకు జిల్లా కలెక్టర్‌కు రైస్ మిల్లర్లు వినతి పత్రం సమర్పించారు. రైతులు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న రైస్ మిల్లింగ్ వ్యవస్థ గత కొన్నేళ్లుగా తీవ్ర నష్టాలను ఎదుర్కొం టున్నదని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగు ణంగా పనిచేస్తున్నప్పటికీ, పెరుగుతున్న ఖర్చులు, విధాన పరమైన సమస్యల వల్ల ఈ పరిశ్రమ సంక్షోభంలో పడిందని తెలిపారు.రాష్ట్రంలో ఇప్పటికే సుమారు మూడో వంతు రైస్ మిల్లులు డిఫాల్టర్లుగా మారినట్లు తెలిపారు. ఇటీవల కరీం నగర్ జిల్లాలో ఒక డిఫాల్ట్ రైస్ మిల్ యజమాని ఆత్మహత్య చేసుకున్న ఘటన మిల్లర్లలో తీవ్ర ఆందోళన కలిగించిందని పేర్కొన్నారు. మిగతా డిఫాల్ట్ మిల్లర్ల పరిస్థితి కూడా ఆందో ళనకరంగానే ఉందని తెలిపారు.అధిక విద్యుత్ చార్జీలు, ప్రభుత్వానికి ఇచ్చిన ధాన్యానికి సంబంధించిన బియ్యాన్ని ఆలస్యంగా తీసుకోవడం, ధాన్యం నిల్వలో నష్టం మరియు నాణ్యత సమస్యల వల్ల అధిక నూకలు రావడం వంటి కార ణాలతో రైస్ మిల్లింగ్ పరిశ్రమ నష్టాల బాటలో నడుస్తోం దని వివరించారు. అంతేకాకుండా మిల్లర్లకు రావాల్సిన మిల్లింగ్, రవాణా, ఎండబెట్టే, సంరక్షణ చార్జీలు కూడా గత కొన్నేళ్లుగా బకాయిగా ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో డిఫాల్ట్ మిల్లర్లపై విధించిన 26 శాతం పెనాల్టీ, 12 శాతం వడ్డీని మాఫీ చేసి, ప్రభుత్వానికి బాకీగా ఉన్న బియ్యాన్ని నాలుగు వాయిదాలలో ఇవ్వడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే బకాయిగా ఉన్న చార్జీలను వెంటనే చెల్లించి రైస్ మిల్లింగ్ పరిశ్రమను కాపాడాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ పరిశ్రమను రక్షించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని మిల్లర్లు కోరారు.ఈ కార్యక్రమం లో అధ్యక్షులు బి నర్సింగరావు, కార్యదర్శి తోడుపునూరి కరుణాకర్, సహాయ కార్యదర్శి జి రాజమౌళి, ట్రెజరర్ జి ఆనంద రెడ్డి, బోయినపల్లి ప్రభాకర్ రావు, అన్న మనేని సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# అబేదా భాను మనోధైర్యానికి మేను

## కష్టాల కడలి నుంచి నలుగురికి ఉపాధి

### పీఎం ట్రైనర్‌గా నిరుద్యోగులకు మార్గదర్శకం

**జమ్మికుంట, మార్చి 9 (నినాదం):** కష్టాల మధ్య జీవిత పోరాటం చేస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి నలుగురికి ఉపాధి కల్పిస్తున్న మహిళగా జమ్మికుంటకు చెందిన అబేధా భాను నిలిచారు. ఒంటరి జీవితాన్ని ధైర్యంగా ఎదుర్కొంటూ ఇద్దరు కుమార్తెలను చదివించి సమాజంలో స్త్రీ అబల కాదు, సబల అని నిరూపిస్తున్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన భాను చిన్న వయసులోనే జమ్మికుంటకు చెందిన ఎండి ఉస్మాన్ భాషాను వివాహం చేసుకున్నారు. ఇద్దరు కుమార్తెలతో కుటుంబాన్ని సాగిస్తూ 2008లో ఒక దుకాణంలో ఉద్యోగం ప్రారంభించి, 2009 నుంచి 2013 వరకు బుక్‌కీపర్‌గా పనిచేశారు. 2013లో రూ.25 వేల స్త్రీనిధి రుణంతో ఒక కుట్టు మిషన్ కొనుగోలు చేసి చిన్న స్థాయిలో టైలరింగ్ ప్రారంభించారు. 2017లో మరో రూ.50 వేల రుణంతో నాలుగు కుట్టు మిషన్లు తీసుకుని స్వయం ఉపాధి పొందడంతో పాటు మరికొందరికి ఉపాధి కల్పించారు. అదే సమయంలో భర్తకు పక్షవాతం రావడంతో కుటుంబ బాధ్యత మొత్తం ఆమెపై పడింది. అనంతరం భర్త మరణించినా ధైర్యం కోల్పోకుండా టైలరింగ్ కేంద్రాన్ని అభివృద్ధి చేశారు.

ప్రస్తుతం 12 కుట్టు మిషన్లతో

**లేడీస్ టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ వర్క్స్...**







నిర్వహిస్తూ పదిమందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఒక్కొక్కరికి నెలకు సుమారు రూ.10 వేల పారితోషికం చెల్లిస్తూ, తనకు నెలకు దాదాపు రూ.40 వేల ఆదాయం వస్తోందని తెలిపారు. ఇద్దరు కుమార్తెలను చదివించి, 2020లో సొంత ఇల్లు కొనుగోలు చేయడంతో పాటు 2023లో పెద్ద కుమార్తెకు ఘనంగా వివాహం జరిపించారు. రెండో కుమార్తె హైదరాబాద్‌లో మెడికల్ కోడింగ్ ఉద్యోగంలో నెలకు రూ.50 వేల వేతనం పొందుతోంది. చేయూత ఫౌండేషన్ ద్వారా సేవలుసమాజసేవ లక్ష్యంగా "చేయూత ఫౌండేషన్"ను ఏర్పాటు చేసి కరోనా సమయంలో ఉచితంగా మాస్కులు తయారు చేసి పంపిణీ చేశారు. పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఉదయం ఉచితంగా జావ అందించారు. అలాగే పీఎం ట్రైనర్‌గా గ్రామీణ నిరుద్యోగ యువతకు టైలరింగ్ శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి దిశగా మార్గనిర్దేశం చేస్తున్నారు.

**మహిళలకు స్ఫూర్తి...**

కష్టాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఏదైనా సాధ్యమని అబేధా భాను జీవితం నిరూపిస్తోంది. తనకు నచ్చిన రంగంలో కష్టపడి పనిచేస్తే విజయాన్ని అందుకోవచ్చని యువతకు ఆమె స్ఫూర్తినిస్తున్నారు.

# ప్రభుత్వ కార్యాలయాలకు కొత్త కళ

### 'తెలంగాణ రైజింగ్' లోగోతో ఆధునీకరణ



**రాజేంద్రనగర్ మార్చి 9 (నినాదం):** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రోగ్రామ్‌లో భాగంగా రంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే పనులు వేగవంతమయ్యాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం శంషాబాద్ మండల కార్యాలయంలో పెయింటింగ్ పనులను అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి స్వయంగా పరిశీలించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డ్ రూమ్ అస్తవ్యస్తంగా ఉండకుండా ఒక సిస్టమెటిగ్గా ఫైల్స్ ను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యాలయాల్లో మంచి వాతావరణం ఉంటే సిబ్బందిలో పనితీరు మెరుగుపడటమే కాకుండా, వచ్చే ప్రజల్లో కూడా సానుకూల దృక్పథం ఏర్పడుతుందని అడిషనల్ కలెక్టర్ పేర్కొన్నారు. అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో 'తెలంగాణ రైజింగ్' లోగోను స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యాలయాల్లో సిబ్బందికి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేకంగా మూత్రశాలల సౌకర్యం కల్పించాలని సూచించారు. మూత్రశాలను క్లీన్ చేయడానికి పర్మినెంట్ గా ఒక వ్యక్తిని ఏర్పరచుకోవాలని ఆయన తెలియజేశారు. నీటితో ఇబ్బంది ఉన్నదని తెలియజేయడంతో ఒక బోర్వెల్ ను వేయించమని తాసిల్దార్ కు తెలిపారు. జిల్లాలోని 27 మండలాలు, 5 డివిజన్లలో ఎక్కడెక్కడ మరమ్మతులు, పెయింటింగ్ అవసరమో అక్కడ పనులు చేపట్టడానికి కలెక్టర్ నిధులు మంజూరు చేస్తారని ఆయన తెలిపారు. కార్యాలయాలు మోడ్రన్‌గా కనిపిస్తే ఆఫీసర్ల కాన్ఫిడెన్స్ పెరుగుతుంది. శంషాబాద్‌లో ప్రారంభమైన ఈ పనులను నాలుగైదు రోజుల్లోనే పూర్తి అవుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్ డి ఓ వెంకటరెడ్డి, శంషాబాద్ తహసీల్దార్ రవీందర్ దత్తు, ఎంపీడీ ఓ మున్ని ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. మొదటి వారం కార్యక్రమాలు ఈ నెల 16వ తేదీ లోపు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

# మైనార్టీ సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

### మంత్రి లక్ష్మణ్ కుమార్

### గల్ఫ్ బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

**ధర్మపురి మార్చి 9(నినాదం):** మైనార్టీల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. సోమవారం ధర్మపురి పట్టణ కేంద్రంలోని షాదీ ఖానాలో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముస్లిం మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాలో మొత్తం 590 మంది మహిళలు కుట్టు మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, మొదటి విడతలో వారికి కుట్టు మిషన్లను అందజేస్తున్నామని తెలిపారు. మిగిలిన వారికి 99 రోజుల ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా అందజేస్తామని చెప్పారు. జిల్లాలో మైనార్టీ రుణాల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే సంబంధిత శాఖ మంత్రి తో మాట్లాడి రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక విజయవంతం చేయాలి**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. గ్రామాలు, పట్టణాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు





కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా పారిశుధ్యం, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

**గల్ఫ్ బాధితులకు ప్రభుత్వం అండ**

ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. గల్ఫ్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తుందని చెప్పారు. ధర్మపురి నియోజకవర్గానికి చెందిన 15 మంది గల్ఫ్ బాధిత కుటుంబాలకు రూ.75 లక్షలు అందజేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందజేస్తామని తెలిపారు. జగిత్యాల జిల్లా నుండి పెద్ద సంఖ్యలో గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్తున్నారని, ప్రమాదవశాత్తు అక్కడ మరణిస్తే కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 250 మంది గల్ఫ్ బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున సహాయం అందజేశామని తెలిపారు. ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి రాజు, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, నియోజకవర్గంలోని మార్కెట్ కమిటీ చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని

# విజయవంతం చేయాలి

### గాజులరామారం సర్కిల్ ఉద్యోగులకు ఉప కమిషనర్ దిశా నిర్దేశం





**కుత్బుల్లాపూర్, మార్చి 9 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ శ్రీపాద రామేశ్వర్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి సంబంధించి సర్కిల్ అధికారులకు, ఉద్యోగులకు తగు సూచనలు చేశారు. ప్రతిరోజు షెడ్యూల్ ప్రకారము కార్యక్రమాలు నిర్వహించి హెడ్ ఆఫీస్ వారు నిర్దేశించిన ఫార్మాట్లలో రిపోర్టులు సబ్మిట్ చేయాలని ఆదేశించడం జరిగింది. గాజులరామారం సర్కిల్ పరిధిలోని ప్రభుత్వ భవనాలు, స్కూళ్లు, పోలీస్ స్టేషన్ , తహసిల్దార్ కార్యాలయం, బస్తీ దవాఖానా వంటివి శుభ్రం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీపాద రామేశ్వర్ గారు, శానిటేషన్ అధికారులు, సిబ్బంది ,కాలనీ వాసులు, యు సిడి ఆర్పీలు పాల్గొన్నారు. సర్కిల్ పరిధిలో చాలా రోజులుగా ఉపయోగించకుండా వదిలేసి ఉంచిన వాహనాలకు ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలకు సంబంధించిన స్టిక్కరింగ్ చేయడం జరిగింది.

NINADAM CINEMA

# సల్మాన్‌కు జోడీగా నయనతార

దక్షిణాదిన అగ్రస్థానంలో ఉన్న కథానాయిక ఎవరంటే.. 'నయనతార' అని టక్కున చెప్పేస్తారు. పారితోషికం పరంగా కూడా నయనే నంబర్ వన్. ప్రస్తుతం ఆ భాష, ఈ భాష అని లేకుండా, అన్ని భాషల్లోనూ సినిమాలు చేస్తూ సత్తా చాటుతున్నది నయనతార. మెగాస్టార్‌తో ఆమె రీసెంట్ హిట్ 'మన శంకర వరప్రసాద్‌గారు' టాలీవుడ్ రీజనల్ సినిమాల్లో నంబర్‌వన్ హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం బాలకృష్ణ 'ఎన్‌బికె 111'లో కథానాయికగా నటిస్తున్నది నయనతార. ఇక తమిళంలో అయితే.. ఆమె చేతిలో చాలా సినిమాలున్నాయి. ఇదిలావుంటే.. రీసెంట్‌గా ఓ బాలీవుడ్ సినిమాకు నయన్ సైన్ చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్‌ఖాన్ హీరోగా రూపొందనున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి టాలీవుడ్ డైరెక్టర్ పైడిపల్లి వంశీ దర్శకుడు. దిల్‌రాజు నిర్మిస్తారట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానున్నది. ఇక నయన్ నటించిన తమిళ చిత్రం 'ముక్తి అమ్మన్' సమ్మర్‌లో విడుదల చేయనుంది.





# ఉస్తాద్‌కు యూఎస్‌లో భారీ బుకింగ్స్

### గంటల్లోనే 50 వేల డాలర్లకు పైగా కలెక్షన్లు

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న మాస్ చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రం ఇప్పటికే భారీ అంచనాలు సృష్టించింది. ఈ సినిమాలో హీరోయిన్లుగా శ్రీలీల, రాశీ ఖన్నా నటిస్తున్నారు. విడుదలకు ముందే ఈ సినిమా పలు రికార్డులను సృష్టించేలా దూసుకెళ్తోంది. ఇటీవల ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా ఈ సినిమాకు మంచి డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా అమెరికాలోని నార్త్ అమెరికా ప్రాంతంలో 'ఉస్తాద్ భగత్ సింగ్'కు మంచి స్పందన లభిస్తోంది. ఇప్పటికే అక్కడ ప్రీమియర్ షోల బుకింగ్స్ ప్రారంభం కాగా, కొన్ని గంటల్లోనే ఈ సినిమా 50 వేల డాలర్లకు పైగా గ్రాస్ వసూలు చేయడం విశేషం. ఇది కేవలం ప్రారంభం మాత్రమే అని సినీ వర్గాలు భావిస్తున్నాయి. పవన్ కళ్యాణ్‌కు విదేశాల్లో ఉన్న భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ దృష్ట్యా, రాబోయే రోజుల్లో బుకింగ్స్ మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా సినిమా కంటెంట్ బలంగా ఉంటే, నార్త్ అమెరికా మార్కెట్‌లో భారీ వసూళ్లు సాధించే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకులు దేవి శ్రీ ప్రసాద్, థమన్ సంగీతం అందిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ? హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమా పై అభిమానుల్లో ఇప్పటికే భారీ క్రేజ్ నెలకొంది. మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. విడుదలకు ముందే ఓవర్సీస్‌లో మంచి బిజినెస్ సాధించడంతో, బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఓజీ చిత్రం తర్వాత పవన్ కళ్యాణ్ నుండి వస్తున్న ఈ సినిమా ప్రభంజనాలు సృష్టించడం ఖాయం అని అంటున్నారు.





# చిన్న పిల్లలపై అత్యాచారాలను అరికట్టాల్సిందే..

### సరస్వతి సినిమా ప్రమోషన్స్‌లో వరలక్ష్మి శరత్ కుమార్

తెలుగు, తమిళ సినీ పరిశ్రమల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా మంచి గుర్తింపు పొందిన వరలక్ష్మి శరత్ కుమార్ తాజాగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల ఆమె ప్రధాన పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహించిన సరస్వతి సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో చిన్నారులపై జరిగే అత్యాచారాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులు సమాజానికి పెద్ద ప్రమాదంగా మారుతున్నాయని ఆమె అన్నారు. అలాంటి నేరాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 'చిన్న పిల్లలను హరాస్ చేసే వాళ్లను, అత్యాచారం చేసే వాళ్లను అసలు వదిలిపెట్టకూడదు. వాళ్లకు సాధారణంగా మరణశిక్ష ఇవ్వడం సరిపోదు. అలాంటి వాళ్లకు మరింత కఠినమైన శిక్షలు ఉండాలి, కట్ చేసి పడేయాలి' అని వరలక్ష్మి పేర్కొన్నారు. నేను ఎప్పుడైనా ముఖ్యమంత్రి అయితే రేప్ లాంటి నేరాలకు పాల్పడే అబ్బాయిలకు కఠినమైన శిక్ష విధించేలా ప్రత్యేక చట్టం తీసుకువస్తాను. అప్పుడు అలాంటి నేరాలు చేయడానికి కూడా వాళ్లు భయపడతారు.





సమాజంలో ఆ భయం రావాలి అని ఆమె అన్నారు. అదే సమయంలో పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు కూడా జాగ్రత్తగా ఉండాలని వరలక్ష్మి సూచించారు. చిన్నారులకు చిన్నప్పటి నుంచే 'గుడ్ టచ్', 'బ్యాడ్ టచ్' గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. పిల్లలకు ధైర్యం ఇవ్వడం, ఏదైనా తప్పు జరిగితే చెప్పేలా వారికి నమ్మకం కల్పించడం ఎంతో ముఖ్యమని ఆమె అభిప్రాయపడ్డారు. ఇక వరలక్ష్మి శరత్‌కుమార్ నటించిన సరస్వతి సినిమా చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడుల నేపథ్యంలో రూపొందిన సామాజిక అంశాలతో కూడిన చిత్రంగా తెరకెక్కింది. ఈ సినిమాతో ఆమె దర్శకురాలిగా కూడా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# త్రిషకు పార్తీబన్ క్షమాపణలు



ఇటీవల చెన్నైలో జరిగిన ఓ ఈవెంట్‌లో త్రిషను ఉద్దేశించి నటుడు, దర్శకుడు పార్తిబన్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. దీనిపై త్రిష కూడా పరోక్షంగా స్పందించడంతో ఆయన మరో పోస్ట్ పెట్టారు. ఈ విషయంలో జరిగినదంతా తప్పుగా భావించారు. ఇప్పుడు నాకు పశ్చాత్తాపపడటం తప్ప మరో మార్గం లేదని తన పోస్ట్‌లో రాశారు. దీంతో ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పడినట్లు అయింది. అసలేం జరిగిందంటే.. గత కొన్ని రోజులుగా త్రిష ప్రేమకు సంబంధించిన రూమర్స్ వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె కోలీవుడ్ అగ్ర కథానాయకుడు విజయ్‌తో కలిసి ఓ వివాహ వేడుకకు హాజరుకావడం ఆ వార్తలకు మరింత బలం చేకూరింది. ఓ ఈవెంట్‌లో త్రిష గురించి పార్తిబన్ మాట్లాడుతూ.. ఆమె కొన్ని రోజులు ఇంట్లోనే ఉండటం మంచిది. ఎందుకంటే ఆమె బయటకు వస్తే ఎక్కడ లేని సమస్యలు వస్తున్నాయని అన్నారు. ఈ వ్యాఖ్యలపై త్రిష పరోక్షంగా స్పందించారు. 'చేతిలో మైక్ ఉంది కదా అని మాట్లాడితే కామెడీ అవ్వదు. అది కేవలం మూర్ఖత్వమే' అని పోస్ట్ పెట్టారు.

### చిత్ర పరిశ్రమలో

# ట్రోల్స్ పెద్ద పదం

విమర్శల నుంచి నేను చాలా నేర్చుకున్నానంటోంది హీరోయిన్ ప్రియాంక అరుళ్ మోహన్. 'మేడ్ ఇన్ కొరియా' సినిమాతో త్వరలోనే వీక్షకులందరికీ కొరియా సంస్కృతిని పరిచయం చేసే తమిళ అమ్మాయిగా ఓటీటీలో సందడి చేయనుంది. ఈ సందర్భంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె సామాజిక మాధ్యమాల్లో తనపై వస్తున్న ట్రోల్స్ గురించి స్పందించింది. 'సోషల్ మీడియాలో 'ట్రోల్స్' అనేది చాలా పెద్ద పదం. గతం గురించి ఆలోచించడం నాకు ఇష్టం లేదు. కానీ, ఇది చిత్రపరిశ్రమ. అనిశ్చితమైన పరిస్థితులు ఎదురవుతాయి. ఇక్కడ ఎవరికైనా ఏదైనా జరగొచ్చు. నేను దాని నుంచే చాలా నేర్చుకున్నాను. సహజంగానే ట్రోల్స్ బాధించినా ఎదగడానికి తోడ్పడతాయి. కొన్నిసార్లు మీరు పడిపోతేనే పైకి రావడానికి అలాంటివి సహాయపడతాయి. నేను ఇలాంటి ప్రతికూల పరిస్థితులను సానుకూలంగా మార్చుకుంటూ కెరీర్‌ని ముందుకు తీసుకెళ్లాలనుకుంను' అని చెప్పింది. గతంలో ప్రియాంక తనపై కొందరు ఉద్దేశపూర్వకంగానే ట్రోల్స్ చేస్తున్నట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787